## 10న రైతు ఆశీర్వాద సభ : మంత్రి తుమ్మల

2 లో



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్తంభాద్రి భద్రాద్రి

బుధవారం | 08 | జూలై | 2026

పేజీలు : 8

# ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న బిజెపి






- రాముడి హుండీకే శఠగోపం
- పార్టీ బలోపేతమే లక్ష్యంగా కార్యాచరణ
- యువతతోనే సమాజ మార్పు
- సిపిఐ శిక్షణా తరగతుల్లో జాతీయ కార్యదర్శి రామకృష్ణ



**ప్రజాపక్షం/భద్రాచలం :** భారతీయ జనతాపార్టీ రాజకీయ పార్టీలను విభజించి లబ్ది పొందే ప్రయత్నంలో ప్రజాస్వామ్యాన్ని అపహాస్య ం చేస్తోందని సిపిఐ జాతీయ కార్యదర్శి కే రామకృష్ణ ఆరోపించారు. 2004 ఎన్నికల్లో 300 సీట్ల కోస ంప్రయత్నం చేసి భంగపడ్డ బిజేపి దేశంలోని రాజీయ పార్టీలను చీల్చి ప్రజాభిప్రాయాన్ని ప్రక్కనపెట్టి పార్లమెంట్‌లో ఆదిపత్యాన్ని పెంచుకునేందుకు యంపర్లాడుతోంద న్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఉమ్మడి ఖమ్మం జిల్లా కౌన్సిల్ సభ్యుల స్థాయి రాజకీయ సైద్దాంతిక శిక్షణా తరగతులు మంగళవారం భద్రాచలంలో ప్రారంభమయ్యాయి. ఈ తరగతులకు ముందు పార్టీ పతాకాన్ని సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు ఆవిష్కరించారు. శిక్షణా తరగతులను ప్రారంభించిన రామకృష్ణ , సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్ అధ్యక్షతన జరిగిన సభలో మాట్లాడారు. పలు రాష్ట్రాల్లో విపక్షాలను చీల్చే ప్రయత్నం చేస్తూ కాశాయం పార్టీ వికృత క్రీడకు తెరలేపిం దన్నారు. బెంగాళ్‌లో బిజేపి వ్యవహరించిన తీరు ప్రజాస్వామ్యానికి

మిగతా 2లో..

## మార్క్సిజానికి ప్రత్యామ్నాయం లేదు





- పెరుగుతున్న ఏకీకృత పెట్టుబడిదారీ విధానం
- శిక్షణా తరగతుల్లో ప్రొ.యుగల్ రాయలు

**ప్రజాపక్షం/భద్రాచలం :** మారిన మారుతున్న కాలమాన పరిస్థితుల్లో ఇప్పటికీ ఎప్పటికీ మార్క్సిజానికి ప్రత్యామ్నాయం లేదని సిపిఐ కేంద్ర ఎడ్యుకేషన్ సబ్ కమిటీ సభ్యులు ప్రొ. యుగల్ రాయలు తెలిపారు. ప్రపంచం ఎదుర్కుంటున్న నూతన సవాళ్లకు ఆర్థిక సంక్షోబానికి మార్క్సిజం ద్వారా మాత్రమే పరిష్కారం లభిస్తుందని ఆయన తెలిపారు. స్థానిక కమ్మ సత్రంలో జరుగుతున్న సిపిఐ శిక్షణా తరగతుల్లో మార్క్సిజం సమకాలీన సమాజంలో దాని ప్రాధాన్యత అనే అంశాయన్ని మంగళవారం ఆయన బోధించారు. బిజేపి లేదా కమ్యూనిస్టు వ్యతిరేకులు ప్రచారం చేస్తున్నట్లుగా అది విదేశీ సిద్దాంతం కాదని, మార్క్సిజం ఓ సైన్సు అని, ఎళ్ల వేళళా ప్రతీ సమస్యకు మార్క్సిజంతో పరిష్కారం పొందొచ్చన్నారు. దేశంలో ఏకస్వామ్య పెట్టుబడి దారీ విధానం పెరుగుతోందని, గతంలో దేశ వ్యాపితంగా పలువురు పెట్టుబడి దారులు ఉండే వారని, ఇప్పుడు ఏవత్ దేశంలో సంపద అంబాని, అదానీ లాంటీ వారి చేతుల్లో పోగుపడుతోందని, ఇది దేశానికి చాలా ప్రమాదకరం అన్నారు. ఆర్థిక వ్యవస్థపై ఆదిపత్యం పెరిగినప్పుడు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోక తప్పదని యుగల్ రాయలు తెలిపారు. బిజేపి మతాన్ని బూచిగా చూపుతోందని, నిజానికి బిజేపి కి మతంపై కంటే అధికారం పైనే ప్రేమ ఉందన్నారు. గోవుల గురించి విస్తృత ప్రచరాం చేస్తున్న కాశాయం పార్టీ పాలనలోనే రికార్డు స్థాయిలో బీఫ్ ఎగుమతులు పెరిగాయని, దీనికి సమాదానం చెప్పాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. మతం మత్తులో ప్రజలను ఉంచడం ద్వారా ఈ దేశ ఆర్థిక వ్యవస్థను బిజేపి ప్రక్క దారి పట్టిస్తోందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు పోలీసు, న్యాయవ్యవస్థలు కార్యనిర్వాహక వర్గం వారి కనుసన్నల్లో పనిచేస్తాయని మార్క్స తెలిపారని, ఇప్పుడు దేశంలో అదే జరుగుతోందని, రాజ్యాంగ వ్యవస్థలు

మిగతా 2లో..

## మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా తెలంగాణ




- నేరస్తుల కదలికలపై నిఘా
- సాంకేతికత వినియోగంలో ముందజ
- గంజాయి పెక్లర్ల కన్న మావోలే మేలు
- ఖమ్మం పోలీసుల పనితీరు బేష్
- డిజిపి సివి ఆనంద్

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** శాంతిభద్రతల పరిరక్షణతో పాటు మాదకద్రవ్య రహిత రాష్ట్రాంగా తెలంగాణను తీర్చి దిద్దటమే లక్ష్యంగా పోలీసుశాఖ పనిచేస్తోందని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు సివి ఆనంద్ అన్నారు. సరిహద్దు రాష్ట్రల నుంచి తెలంగాణ కు తరలివస్తున్న మాదక ద్రవ్యాలు, గంజాయి వంటి మత్తుపదార్థలను కట్టడి చేసేందుకు గత మూడు రోజులుగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పర్యటించగా మంగళవారం ఖమ్మం కమిషనరెట్‌ను సందర్శించి జిల్లా పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించినట్లు చెప్పారు. నేరాల నియంత్రణ, మాదకద్రవ్యాలు, గంజాయి అక్రమ రవాణ, సైబర్ నేరాల దర్యాప్తులో ఖమ్మం జిల్లా పోలీసుల పనితీరు ప్రశంసనీయమని కితాబునిచ్చారు. తెలంగాణలో పోలీస్‌ను బలపరిచి కచ్చితత్వంతో పనిచేసేవిధంగా వారికి తగిన సూచనలు ఇచ్చినట్లు చెప్పారు. ప్రధానంగా ప్రజలకు పోలీసు శాఖ నుంచి ఏది ఆశిస్తారో ఆదిశగా పనిచేసేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు. ముఖ్యంగా బెసిక్ పోలీసింగ్ పాటించాలని సినియర్ ఆఫీసర్లు తరచూ స్థానిక పోలీస్ స్టేషన్లను సందర్శిస్తూ వారి పరిధిలోని గ్రామాలు, పట్టణాలను విజిట్ చేయడంతో పాటు సిబ్బందితో విజిటింగ్ రికార్డులో నమోదు చేయాలన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో ఎస్‌హెచ్‌ఓలు మూడు గంటల నుంచి సాయంత్రం ఐదుగంటల వరకు తప్పనిసరిగా రాష్ట్రవ్యాప్తంగా అందరూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించామన్నారు. నేరనియంత్రణ, దర్యాప్తులో భాగంగా నమోదైన కేసుల చేధించడంతో పాటు నేరస్తులను ఆరెస్ట్ చేయడం నుంచి చార్జీషీట్, కోర్టులో నిందితులకు శిక్షపడేలా న్యాయమూర్తులతో సత్సంబంధాలు ఏర్పారుచుకుని, సరైన సాక్ష్యాధారాలు సమర్పించాలని సూచించారు. ఆకస్మిక తనిఖీలు, పగలు, రాత్రిగస్తీ వంటి ఆంశాల్లో ఖమ్మం పోలీసులు ముందంజలో ఉన్నారని ప్రశంసించారు. అదేవిధంగా

మిగతా 2లో..

# ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న బిజెపి

(మొదటిపేజీ తరువాయి)
గొడ్డలిపెట్టుగా మారిందన్నారు. ఒకప్రక్క సర్ పేరుతో ఓట్లను తొలగిస్తూ మరో ప్రక్క రాజకీయ పార్టీలను ముక్కలు చేస్తుందని రామకృష్ణ ఆరోపించారు. బిజేపి అధికారంలోనికి రావడానికి కారణమైన రామానామాకే చివరకు శఠగోపంపెట్టే పరిస్థితి తీసుకొస్తోందన్నారు. అయోధ్య రామాలయంలో సుమారు రూ.1400 కోట్లను బిజేపి అనుబంధ సంస్థలైన్ విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్‌లు దారిమళ్లించాయని, దీనిపై మోడి సమాధానం చెప్పాలన్నారు. దేశవ్యాప్తంగా రూ.3624 కోట్ల విరాళాలు వచ్చాయని చెబుతున్న మత సంస్థలు దారితప్పిన నిధులపై ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని రామకృష్ణ ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. హిందూ దేవాలయాల నిధుల కైంకర్యంతో బిజేపి భక్తుల మనోభావాలను దెబ్బతీసిందన్నారు. దీనిపై బిజేపి మిత్రపక్షాలు స్పందించాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. బంగారు, వెండి వర్తకులు చెబుతున్నట్లుగా టన్నుల కొద్ది వచ్చిన బంగారం, వెండి పై విచారణ జరపాలన్నారు. బిజేపి నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారతదేశాన్ని అసంబద్ధ ప్రచారాన్ని ముందుకు తెచ్చిందని ఇది సరికాదన్నారు. ఒకప్రక్కదేశంలో ఆర్థికం అంతరాలు పెరుగుతున్నాయని, రూ.55 లక్షల కోట్ల అప్పు 2014లో ఉంటే, ఇప్పుడు అది రూ.230 లక్షల కోట్లకు పెరిగిందని, రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే కనిష్ట స్థాయికి చేరిందన్నారు. మోడి అధికారంలోకి వచ్చేనాడు ఒక డాలరుకు రూ.58 ఉన్న రూపాయలు ఉన్న పరిస్తితి నుండి ఇప్పుడు రూ.95కి పడిపోయిందని ఆయన చెప్పారు. 12 కోట్ల జనాభా కలిగిన జపాన్‌తో పోల్చుకోవడం సరికాదన్నారు. స్వారూప్య కలిగిన చైనాతో సరిపోల్చుకున్నప్పుడు భారతదేశ ఆర్థిక వ్యవస్థ 3.9 ట్రిలియన్ డాలర్లుగా ఉండగా, చైనాది 19 ట్రిలియన్ డాలర్స్‌గా ఉందని దీనికి బిజేపి సమాధానం చెప్పాలన్నారు. బిజేపి ఈ 12 ఏళ్ల కాలంలో ఏ ఒక్క వాగ్దానాన్ని అమలు చేయలేదని, ధరలు, నిరుద్యోగం నానాటికీ పెరిగిపోతోందని, తెస్తానని చప్పిన బ్లాక్ మని తీసుకురాలేదని, దేశంలోని అవినీతిని అరికడతానని అధికారంలోనికి వచ్చిన మోడి ఘోరంగా వైఫల్యం చెందారన్నారు. బిజేపి ఇప్పుడు ఒక విపత్కర స్థితిని ఎదుర్కొంటూ అసత్య ప్రచారంతో ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేస్తుందన్నారు.

### మార్పు తథ్యం...

ప్రపంచ వ్యాప్తింగా ప్రజల అవసరాలను గుర్తించి పాలన చేయని వారిని గద్దె దింపుతున్నారని, ఇందులోయువత ప్రధాన పాత్రపోషిస్తోందని రామకృష్ణ అన్నారు. ప్రస్తుత తరం మార్పు కోరుకుంటోందని తెలిపారు. ఇటీవల దేశంలో కాక్రోచ్ జనతా పార్టీకి వచ్చిన స్పందన తమిళనాడులో టివికే గెలుపు ఇవన్నీ మార్పులను సూచిస్తున్నాయన్నారు. కొత్తగూడెంలో ఒక సానుకూల పరిణామం తొలి మేయర్ గెలిచేందుకు కారణమైందని, అలాంటి పరిస్థితులే దేశంలో పునరావృతం కానున్నాయన్నారు. పెరిగిన నిరుద్యోకం, అవినీతి ఆర్థిక అంతరాలు రానున్న కాలంలో మార్పుకు దారితీస్తాయని ఆయన తెలిపారు. నేపాల్, శ్రీలంక, బంగ్లాదేశ్‌లో వచ్చిన పరిణామాలు భారత్‌లో కూడా రానున్నాయన్నారు. యువత విద్యార్థులను ఆకర్షించడం ద్వారా ముందుకు సాగాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు.

### బలోపేతమే లక్ష్యంగా కార్యాచరణ....

పార్టీ బలోపేతమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించడం జరిగిందని రామకృష్ణ తెలిపారు. ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి పోరాటాలు చేసేందుకు ఆగస్టు 6 తేది నుండి 15 వరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామగ్రామాన పాదయాత్రలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 1న ప్రస్తుతం బిజేపి ప్రజావ్యతిరేక విధానాలను నిరశిస్తూ ఛలో డిల్లీ పిలుపునిచ్చామని ఆయన తెలిపారు.

ఈ తొలిరోజు శిక్షణ తరగతుల్లో మార్క్సిజం సమకాలీన సమాజంలో దాని ప్రాధాన్యత అనే అంశాన్ని ప్రొ యుగల్ రాయల్, తీవ్ర ఆర్థిక సంక్షోబంలో భారదేశం అనే అంశాన్ని బివి మోహన్ రెడ్డి బోధించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, సిపిఐ రాష్ట్ర నాయకులు ముత్యాల విశ్వనాథం, జమ్ముల జితేందర్ రెడ్డి, కల్లూరి వెంకటేశ్వరరావు, ఎర్రా బాబు, నరాటి ప్రసాద్, సరెడ్డి పుల్లారెడ్డి, ఎస్‌కే జానీమియా, మున్నా లక్ష్మీ కుమారి, ఏపూరి లతాదేవి, గోవిందరావు, ఎస్‌డి సలీం, సలిగంటి శ్రీనివాస్, చంద్ర నరేంద్ర, కర్ణకుమార్, చంద్ర నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# మార్క్సిజానికి ప్రత్యామ్నాయం లేదు

(మొదటిపేజీ తరువాయి)
ఒక రాజకీయ పక్షానికి మద్దుతుగా పనిచేస్తున్నాయని యుగల్ రాయలు తెలిపారు. కమ్యూనిస్టులంగా శాస్త్రీయ దృక్పదాన్ని అలవర్చుకోవాలని, ప్రతీ సమస్యకు కమ్యూనిస్టు కోణంలో పరిష్కార మార్గాన్ని అన్వేషించాలన్నారు. బిజేపి లేదా, ఇతర మతోన్మాద చర్యలు పాక్షికమే అని, మార్పు తథ్యమని ఆ మార్పుకు అనుగుణంగా పనిచేయాల్సి ఉందని యుగల్ రాయలు సూచించారు. కమ్యూనిస్టుల సీట్ల సంఖ్య ఎంత అనేది ప్రధానం కాదని, కమ్యూనిస్టులు చట్ట సభల్లో ఉంటే ప్రజా అనుకూల నిర్ణయాలు జరుగుతాయని ఆ విషయాన్ని కమ్యూనిస్టు వ్యతిరేకులు సైతం పలు సందర్భాల్లో అంగీకరించారని ఆయన తెలిపారు. అందుకే కమ్యూనిస్టులకు వేసే ఓటు చాలా విలువైందని, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అయినా, ప్రధాని మోడి అయినా కమ్యూనిస్టులను చూసి భయపడేది ఎందుకంటే ఈ వ్యవస్థ మార్పు వారితోనే సాధ్యమవుతుందని నమ్ముతున్నారని అన్నారు. మానవ ఆలోచనలను ప్రక్క దారి పట్టించే ప్రయత్నాన్ని సైద్ధాంతికంగా ఎదుర్కోవడాన్ని మార్క్సిజం నుండి నేర్చుకోవాలన్నారు.

### ఆర్థిక సంక్షోభంలో దేశం : బివి మోహన్ రెడ్డి...

దేశంలో పెరుగుతున్న ఆర్థిక అంతరాలు దేశానికి అత్యంత ప్రమాదకరమని, కొద్దిమందిచేతుల్లో పోగుపడుతున్న సంపద విపత్కర పరిణామాలకు దారి తీస్తుందని ప్రముఖ ఆర్థిక విశ్లేషకులు బివి మోహన్ రెడ్డి తెలిపారు. సిపిఐ శిక్షణా తరగతుల్లో ఆర్థిక సంక్షోభంలో భారతదేశంపర్యావసనాలుభవిష్యత్‌లో దాని ప్రభావం అనే అంశంపై ఆయన బోధించారు. ఈ సందర్భంగా మోహన్ రెడ్డి మాట్లాడుతూ పాలకులు చెబుతున్నట్లుగా భారతదేశ ఆర్థికవ్యవస్థ బలోపేతం కాలేదన్నారు. కానీ సంపన్నుల సంఖ్య మాత్రం పెరుగుతోందని, దేశంలో 90శాతం సంపద ఒక్క శాతం ప్రజల చేతుల్లో ఉందని ఆయన స్పష్టం చేశారు. ఆదే సమయంలో మునుపెన్నడూ లేని విధంగా పేదరికం పెరుగుతుందని తెలిపారు. ఇది దేశంలో అశాంతికి ఆందోళనలకు దారితీస్తుందన్నారు. నాల్గోవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదుగుతోందనే ప్రచారంలో ఏ మాత్రం నిజం లేదని స్పష్టం చేశారు. బిజేపి పాలనలో అప్పులు పెరిగి ఆర్థిక వ్యవస్థ విచ్చిన్నమవతోందని, దీనికి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవకరం ఉందని ఆయన కోరారు. ప్రజా చైతన్యం ద్వారా మాత్రమే ఆర్థిక అసమానతలను అదిగమించే అవకాశం ఉందన్నారు. జమ్ముల జించేందర్ రెడ్డి ప్రిన్సిపల్‌గా, కల్లూరి వెంకటేశ్వర్లు వైస్ ప్రిన్సిపల్‌గా వ్యవహరించిన ఈ శిక్షణా తరగతుల్లో సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్‌తో పాటు పలువురు రాష్ట్ర నాయకులు, జిల్లా కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

## క్వారీలో డంపర్ పల్టీ.. డ్రైవర్ మృతి

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** క్వారీలో ప్రమాదవశాత్తు డంపర్ పల్టీ కొట్టి డ్రైవర మృతి చెందిన ఘటన మండలం లో చోటు చేసుకుంది. స్థానికుల కధనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి మండలంలోని కోరట్లగూడెం సమీపంలోని ఓ క్వారీలో మంగళవారం డంపర్ పల్టీ కొట్టింది. ఉత్తరప్రదేశ్ కు చెందిన డ్రైవర్ అక్కడిక్కడే మృతి చెందాడు. క్వారీ నిర్వహాకులు స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. స్థానిక ప్రభుత్వ హస్పిటల్ లో మృతదేహాం కు పోస్టుమార్టమ్ ను నిర్వహించారు

## సేవా భారతి అధ్యక్షులుగా డా|| మారుతిబాబు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సేవా భారతి సంస్థ ఖమ్మం జిల్లా అధ్యక్షులుగా ప్రముఖ వైద్యులు, సామాజిక సేవకులు డా॥ మారుతిబాబును నియమించారు. అదేవిధంగా జిల్లా నూతన కమిటీని మంగళవారం నియమించారు. ప్రధాన కార్యరద్శిగా రవీందర్, సంయుక్త కార్యదర్శిగా యుగందర్, కోశాధికారిగా రామారావు, జిల్లా కమిటీ సభ్యులుగా డా॥ దారవత్ వెంకట్‌ను నియమించారు. వైద్య రంగంతో పాటు వివిధ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ ప్రజలకు విశేష సేవలు అందిస్తున్న డా॥ మారుతిబాబుకు సేవా భారతి బాధ్యతలు అప్పగించినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. డా॥ మారుతిబాబు మాట్లాడుతూ సేవా భారతి ఆశయాలకు అనుగుణంగా అన్ని వర్గాల ప్రజలకు అవసరమైన సేవా కార్యక్రమాలను అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఆరోగ్య శిబిరాలు, విద్యా సహాయం, విపత్తు సహాయక చర్యలు, స్వాలంభన కార్యక్రమాలను సేవా భారతి ఆధ్వర్యంలో నిర్వహిస్తామని తెలిపారు. డా॥ మారుతిబాబు నియామకం పట్ల పలువురు వైద్యులు, పుర ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు.

## 10న రైతు ఆశీర్వాద సభ : మంత్రి తుమ్మల

**ప్రజాపక్షం/చింతకాని :** ఈ నెల 10 న చింతకాని మండలం జగన్నాధపురంలో రైతు ఆశీర్వాద సభ నిర్వహించనున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల పేర్కొన్నారు. మంగళవారం జగన్నాధపురంలో ని రైతు ఆశీర్వాద సభా ప్రాంగణాన్ని కలెక్టర్ టిఎస్ దివాకర, సీపీ సునిల్‌దత్ తో కలిసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల సభా ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. తుమ్మల మాట్లాడుతూ తొలకరి కంటే ముందే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నా తొమ్మిది రోజుల్లో రూ.9వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమచేస్తున్నామన్నారు. ఆర్థిక భారమైనప్పటికీ రైతుల నుంచి మద్దతు ధరకు ప్రతి గింజ కొనుగోలు చేశామని, దేశంలో ఏ రాష్ట్రం మద్దతు ధరకు పంట కొనుగోలు చేయకపోయినప్పటికీ నష్టమైనా రైతుల వద్ద నుంచి మద్దతు ధరకు పంట కొనుగోలు చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణా నన్నారు. యూరియా సరిపడా అందుబాటులో ఉందని యాప్ ద్వారా తెలంగాణలో యూరియా పంపిణీ విధానాన్ని దేశంమొత్తం అమలు చేయాలని కేంద్రం సూచిస్తుందన్నారు. ఈ నెల 10న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొనే రైతు ఆశిర్వాద సభను రైతులు అధిక సంఖ్యలో పాల్గొని పెద్ద మనసుతో ఆశీర్వదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ టిఎస్ దివాకర, సీపీ సునిల్‌దత్ , గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సైజన్య, ఖమ్మం, మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్లు హనుమంతరావు, వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా తెలంగాణ

(మొదటిపేజీ తరువాయి) పగలు రాత్రి గస్తి పెంచడంతో పాటు రౌడిలు, దొంగలు, నేరస్తులపై నిఘా పెట్టాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగంలో తెలంగాణ పోలీసులు ముందంజలో ఉన్నారన్నారు. సిసిటిఎన్ఎస్‌పి టూ, టిజికాప్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌ను ఏవిధంగా పోలీసింగ్ అంశాల్లో వినియోగించుకోవచ్చు అనేదానిపై జిల్లా కేంద్రంలో ఒక టీమ్ ఏర్పాటు చేసి అందరికి సూచనలు ఇస్తున్నట్లు తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఖమ్మం జిల్లాలో సమర్థవంతంగా జరుగుతోందని, మాదక ద్రవ్యాలపైన ప్రత్యేక దృష్టిసారించామన్నారు. నార్కోటిక్స్ వలన రాష్ట్రానికే కాక దేశానికి పెద్ద ముప్పన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని భవిష్యతు తరాలపై పడకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గంజా విక్రయాలు, రావాణపై కఠినంగా వ్యవహరించనున్నారు. గంజాయి విక్రయదారుల కన్న మావోయిస్టులే మేలన్నారు. ఎందుకంటే గంజాయి విక్రయదారులు ప్రతి ఇంట్లో పిల్లాలను చాక్లెట్లు వంటి రూపాల్లో గంజాయికి బానిసలను చేస్తున్నారన్నారు. దీనిని కట్టడి చేసేందుకు పోలీసుశాఖకు ప్రజలు, మీడియా, సోషల్‌మీడియ సహకరించి దీనిపై యుద్ధం చేయవలసిన అవసరం ఉందన్నారు. కొన్ని రాష్ట్రాలు నార్కోటిక్స్, మాదక ద్రవ్యాలకు అలవాటు పడి చివరికి పనిచేసేవారు కరువైన పరిస్థితి నెలకొందన్నారు. ఆతరహా పరిస్థితులు మన రాష్ట్రంలో రాకుండా ఉండాలని చర్యలు తీససుకుంటున్నట్లు తెలిపారు. ఖమ్మం జిల్లా చుట్టుపక్కల ఏపి, ఒరిస్సా, చతీష్‌గడ్ అటవి ప్రాంతం నుంచి గంజాయి సాగు చేసేవారు రవాణా చేస్తూ విక్రయాలు చేసాగిస్తున్నారన్నారు. గంజాయి రావాణాకు ఇది ప్రవేశ ప్రాంతంగా మారిందన్నారు. అటువంటి రాష్ట్ర సరిహద్దు జిల్లాలైన అదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, ములుగు, భూపాలపల్లి లో పర్యటిస్తున్నట్లు తెలిపారు. ఎంట్రిపాయింట్లను కట్టుదిట్టం చేసి గంజాయి విక్రయదారులపై ఉక్కుపాదం మోపి వారిని ఆరెస్ట్ చేయడంతో పాటు వారి ఆస్తులను జప్తు చేస్తూ, పిడి యాక్ట్ నమోదుచేస్తే తప్పకుండా గంజాయి రవాణ, విక్రయాలు కట్టడిచేయవచ్చని అన్నారు. ఆదిశగా ఆయా జిల్లాల పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ విషయంలో ఖమ్మం పోలీసుల పనితీరు బేష్ అని డిజిపి ప్రశంసించారు.

### సైబర్‌నేరాలు కట్టడి..

ఖమ్మం జిల్లాలో దొంగతనాలు, దోపిడి ద్వారా దాదాపు 11 కోట్లు పోతే సైబర్ క్రైమ్‌ల ద్వారా డిజిటల్ అరెస్ట్‌లు, ప్రలోబాలతో 42 కోట్ల విలువ గల ఆస్తులు, బ్యాంక్ ఖాతాల నుంచి డబ్బు పోగోట్టుకున్నారని అన్నారు. ఇందులో ఆని వర్గాల ప్రజలు ఉన్నారన్నారు. ప్రజలను సైబర్ నేరస్తుల నుంచి కాపాడెందుకు ప్రత్యేకంగా సైబర్‌క్రైమ్ సెల్ ఏర్పాటు చేసి సేవలందిస్తున్నట్లు డిజిపి తెలిపారు. అదేవిధంగా స్వలాభం కోసం సోషల్ మీడియా వేదికగా రెండు వర్గాల మధ్య విభేదాలు సృష్టించి వారిపై చట్టపరమైన చర్యలు తీపుకోవడం జరుగుతుందన్నారు. ఈ సమవేశంలో ఆయన వెంట ఐజి చంద్రశేఖర్‌రెడ్డి, ఈగల్ ఎస్‌పి గిరిధర్, ఖమ్మం పోలీసు కమిషనర్ సునిల్‌దత్, ఏసిపి వసుంధర ఉన్నారు.

## రూ. 367.29 కోట్లు రైతుల ఖాతాల్లో జమ

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రైతు భరోసా పథకానికి సంబంధించి ఎనిమిది ఎకరాల వరకు ఉన్న రైతులకు మంగళవారం నిధులు జమ చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి డి. పుల్లయ్య తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఇప్పటి వరకు 333743 మంది రైతులకు గాను రూ. 367.29 కోట్లు నిధులు జమ చేసినట్లు ఆయన తెలిపారు. ఖమ్మం నియోజక వర్గంలో 18174 మంది రైతులకు రూ.20.87 కోట్లు, సత్తుపల్లి నియోజక వర్గంలో 83791 మంది రైతులకు రూ.91.47 కోట్లు, పాలేరు 78193 మంది రైతులకు రూ. 80.36 కోట్లు, మధిర నియోజక వర్గంలో 87964 మంది రైతులకు రూ. 95.25 కోట్లు, వైరా నియోజక వర్గంలో 64430 మంది రైతులకు రూ. 78.37 కోట్ల నిధులు జమ చేసినట్లు ఆయన తెలిపారు.

## వార్ రూమ్ ప్రారంభం




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వార్ రూమ్‌ను జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ కార్యాలయంలో వార్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ జరుగుతున్న నేపథ్యంలో వార్ రూమ్ ద్వారా బిఎల్‌ఏలకు సూచనలు, సలహాలు అందిస్తామని తెలిపారు. క్షేత్ర స్థాయిలో ఓటర్లకు బూత్ లెవల్ ఏజెంట్లు నిత్యం అందుబాటులో ఉంటూ సహాయ సహకరాలు అందించాలన్నారు. అర్హులైన ప్రతి ఓటు జాబితాలో ఉండేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, సయ్యద్ గౌస్, మొక్కా శేఖర్ గౌడ్, తూములూరి లక్ష్మి నర్సింహారావు, కిలారు అనిల్ కుమార్, కొట్టే రాజశేఖర్, దామా స్వరూప, వేల్పుల మురళీ, భవాని, ప్రతిభారెడ్డి, నీలవేణి, పద్మ, పి. రాజుగౌడ్, కుక్కల రామకృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

# వినియోగదారుల ఆరోగ్య పరిరక్షణకు కృషి

**-ఫుడ్ సేఫ్టీ అధికారి శరత్**
**-పిస్తా హౌజ్‌లో తనిఖీలు**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** వినియోగదారుల ఆరోగ్య పరిరక్షణకు ఫుడ్ సేఫ్టీ శాఖ ఎల్లప్పుడు కృషి చేస్తుందని ఇంచార్జి జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి ఈ. శరత్ తెలిపారు. ఖమ్మం నగరంలోని పిస్తా హౌజ్ రెస్టారెంట్‌లో భోజనం చేసిన అనంతరం తమ కుమార్తె అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఓ వినియోగదారుడు చేసిన ఫిర్యాదు మేరకు మంగళవారం ఫుడ్ సేఫ్టీ అధికారులు సంబంధిత రెస్టారెంట్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రత, నిల్వ విధానాలు, వంటశాల నిర్వహణ, ఆహార భద్రత ప్రమాణాల అమలును క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీల్లో భాగంగా రెండు ఆహార పదార్థాల చట్టబద్ధ నమూనాలను సేకరించి విశ్లేషణ నిమిత్తం రాష్ట్ర ఆహార ప్రయోగశాలకు పంపించారు. ఈ సందర్భంగా ఫుడ్ సేఫ్టీ అధికారి శరత్ మాట్లాడుతూ ప్రయోగశాల నివేదికలు అందిన అనంతరం వాటి ఫలితాల ఆధారంగా ఆహార భద్రత ప్రమాణాల చట్టం ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందేలా జిల్లాలోని హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, స్వీట్ షాపులు, ఇతర ఆహార సంస్థలపై ఫుడ్ సేఫ్టీ శాఖ నిరంతర తనిఖీలు నిర్వహిస్తుందన్నారు. ఆహార వ్యాపార నిర్వాహకులు పరిశుభ్రమైన వాతావరణంలో ఆహారాన్ని తయారు చేసి విక్రయించాలని నాణ్యమైన ముడి పదార్థాలను మాత్రమే వినియోగించాలన్నారు. వినియోగదారులు ఆహారం తీసుకునే సమయంలో పరిశుభ్రత, నాణ్యత విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. నాసిరకం లేదా కలుషితమైన, గడువు ముగిసిన ఆహార పదార్థాలు విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే వెంటనే ఫుడ్ సేఫ్టీ శాఖ దృష్టికి తీసుకు రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ శాఖ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సన్‌రైజ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సామగ్రి వితరణ





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సన్‌రైజ్ అభ్యుదయ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు సామగ్రి వితరణ చేశారు. మంగళవారం కల్లూరు మండలం ఎర్రబోయినపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సన్‌రైజ్ సంస్థ ఆధ్వర్యంలో బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుగు సుమన్‌బాబు తండ్రి ఏనుగు రాఘవయ్య వర్ధంతి సందర్భంగా విద్యార్థులకు రూ. 15వేలు విలువ చేసే షూ, టై, బెల్ట్ మొదలగు సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల పంచాయతీ అధికారి ఏనుగు సురేష్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన వసతులను సన్‌రైజ్ అభ్యుదయ సేవా సమితి ఆధ్వర్యంలో పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. బిజెపి నాయకులు ఏనుగు సుమన్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సంస్థ ఆధ్వర్యంలో వస్తువులను అందించడం సంతోషకరంగా ఉందన్నారు. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మాలతిదాస్, సంస్థ ప్రతినిధులు ఏనుగు కిరణ్‌బాబు, శోభన్‌బాబు, పాఠశాల ఉపాధ్యాయ బృందం, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

# గిరిజన సర్పంచ్‌ను అవమాన పరుస్తారా..?

**-అధికార పార్టీ నాయకులకు గిరిజనులు అంటే చులకనా...?**
**-విలేకరుల సమావేశంలో సర్పంచ్ బోరున విలపిస్తూ ఆవేదన**



**ప్రజాపక్షం/పెనుబల్లి:** పెనుబల్లి గ్రామ సర్పంచ్ ను అధికార పార్టీకి చెందిన నాయకుడు తీవ్ర పదజాలంతో దూషించినట్లు సమావేశంలో మంగళవారం బోరున విలపిస్తూ తెలిపారు. మండల పరిధిలోని పెనుబల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ అయిన భూక్య పాప సోమవారం పంచాయతీ సిబ్బందితో గ్రామంలో సిసి రోడ్డు పనులు నిర్వహిస్తుండగా అటుగా వచ్చిన గ్రామానికి చెందిన అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు వచ్చి పంచాయతీ సిబ్బంది ఎదుటనే కులం పేరుతో దూషించి దుర్భషలాడారని, గత ఆరు నెలలుగా తన మానసికంగా ఇబ్బందులు గురవుతున్నట్లు బోరుణ విలపిస్తూ తెలిపింది. సర్పంచ్ ఎన్నికల్లో తనపై టిఆర్ఎస్ పార్టీ తరపున గెలవలేకపోయినానని అప్పటినుండి తనపై కక్ష కట్టి తన భర్తను పిల్లలను తీవ్ర మానసిక గా వేధిస్తున్నట్టు తెలిపింది. తన భర్త ప్రభుత్వ ఉద్యోగి అని తన భర్తను సస్పెండ్ చేయిస్తానని అలాగే తన పిల్లలు భర్తను కారుతో ఢీకొట్టేందుకు ప్రయత్నించానని ఆమె తీవ్ర ఆవేదన వెల్లిబుచ్చారు. పెనుబల్లి సర్పంచ్ గా విధులలో చేరిన అప్పటి నుండి ఇదే ఇబ్బందులు గురి చేస్తున్నారని తనకు రక్షణ కల్పించే పోలీసు చర్యలు తీసుకోవాలని ఇదే విషయమై స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగిందని సర్పంచ్ బి పాప తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ జడ్పిటిసి చెక్కిలాల మోహన్‌రావు, రామచంద్రరావు బంజర్ సర్పంచ్ జి హైమావతి, మాజీ సర్పంచులు మందడపు అశోక్ కుమార్, తావు నాయక్, ఉప సర్పంచ్ చీపి కృష్ణ, మూడు వాసు, పొట్టపల్లి నాగప్రసాద్, గౌస్, బొర్రా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# సర్ కార్యక్రమాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్ శ్రీజ



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ 7, 8 వార్డుల్లో అడిషనల్ కలెక్టర్ శ్రీజ పర్యటించారు. ఈ సందర్భంగా సర్ కార్యక్రమ విధానాన్ని అడిషనల్ కలెక్టర్ శ్రీజ, మండల తహశీల్దార్ సురేష్, మున్సిపల్ కమీషనర్ రామచంద్రరావు స్థానిక బిఎల్ఓను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఓటు నమోదు ప్రక్రియ సమర్థవంతంగా పూర్తి చేసి ఓటర్లకు అవగాహన కల్పించాలని కోరారు. ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించాలని కోరారు. ప్రతి పౌరుడికి ఓటు హక్కు ఎంతో విలువైందని, ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. అనంతరం వైరా మున్సిపల్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. మున్సిపాలిటీలో అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ డంపింగ్ యార్డ్ సమస్యలను వెంటనే పూర్తి చేయాలని కోరారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రతి వార్డును పరిశుభ్రంగా ఉంచేవిధంగా చూడాలని మున్సిపల్ ఛైర్మన్, కమీషనర్ కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళ, వైస్ ఛైర్మన్ కట్ల సంతోష్, వార్డు కౌన్సిలర్లు వరలక్ష్మి, ఫణితి సైదులు, చిలకా చిన్న కోటయ్య, మున్సిపల్ కమీషనర్ రామచంద్రరావు, జిల్లా కాంగ్రెస్ మెడికల్ అండ్ హెల్త్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణ, వుంద్రు శ్యామ్‌బాబు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రయాణికుల సౌకర్యార్థం మిస్ట్ బస్టాండ్లు

**-ప్రారంభించిన డిప్యూటీ కమిషనర్**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రయాణికుల సౌకర్యార్థం ఖమ్మం నగరంలో మిస్ట్ బస్టాండ్లు ఏర్పాటు చేసినట్లు ఖమ్మం కార్పోరేషన్ డిప్యూటీ కమిషనర్ కె. శ్రీనివాసరావు తెలిపారు. ఖమ్మం కార్పోరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మిస్ట్ బస్టాండ్లను డిప్యూటీ కమిషనర్ కె. శ్రీనివాసరావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రత నుంచి ప్రయాణికులకు ఉపశమనం కల్పిస్తూ బస్సుల కోసం వేచి ఉండే సమయంలో చల్లదనాన్ని అందించేలా ఈ మిస్ట్ బస్టాండ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆధునిక సౌకర్యాలతో పర్యావరణహిత నిర్మాణ శైలిలో వీటిని రూపొందించినట్లు తెలిపారు. పచ్చదనంతో పాటు మిస్ట్ స్ప్రే వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రయాణికులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ ధరణి, ఏఈ యాకూబ్ వలీ, ప్రయాణికులు తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం-వల్లభి రూట్లో బస్సుల కొరత

**- అవస్థలో ప్రయాణికులు**



**ప్రజాపక్షం/ముదిగొండ:** ఖమ్మంవల్లభి మార్గంలో నడుస్తున్న ఆర్టీసీ బస్సుల్లో తీవ్రమైన రద్దీ నెలకొనడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ముదిగొండ కేంద్రంలో బస్సుల కొరత కారణంగా వృద్ధులు, చిన్నపిల్లలతో ఉన్న మహిళలు గంటల తరబడి వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొందని ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. బస్సులు వచ్చినా ఇప్పటికే కిక్కిరిసిపోయి ఉండటంతో ఎక్కడం కూడా కష్టంగా మారిందని, లోపల కనీసం నిలబడేందుకు కూడా స్థలం లేక ఊపిరాడని పరిస్థితులు ఎదురవుతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. ప్రతీ రోజూ ఉద్యోగులు, విద్యార్థులు, గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఈ మార్గంలో ప్రయాణిస్తున్నందుకు రద్దీ మరింత పెరుగుతోందన్నారు. ఈ నేపథ్యంలో ఖమ్మంవల్లభి రూట్లో తక్షణమే అదనపు ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసి ప్రయాణికుల ఇబ్బందులు తొలిగించాలని అధికారులను ప్రజలు కోరుతున్నారు.

# పేద విద్యార్థులకు నోట్స్ పంపిణీ



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పేద విద్యార్థులకు చేయూత అందించాలనే ఉద్దేశంతో సుధా హెర్బల్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ కొనకళ్ల సుధారాణి మంగళవారం సత్తుపల్లి ఎన్టీఆర్ నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 153 మంది విద్యార్థులకు నోట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఔషధ మొక్కలు నాటి, వాటి ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. పేదరికం కారణంగా ఏ విద్యార్థి చదువుకు దూరం కాకూడదని, విద్యార్థులకు తగిన ప్రోత్సాహం అందిస్తే వారు ఉన్నత స్థాయికి చేరుకుంటారని ఆమె అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లాల్ అహ్మద్, ఉపాధ్యాయులు శేషు కుమార్, నరసింహారావు, లక్ష్మి , లావణ్య, విజయ తదితరులు పాల్గొన్నారు.

# అన్నం ఫౌండేషన్‌లో అన్నదానం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** అన్నం ఫౌండేషన్‌లో అనాథలకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. యూనిటి ఇన్ డైవర్సిటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఉద్యోగ విరమణ సందర్భంగా రాకం శ్యాంబాబు దంపతులు అన్నం ఫౌండేషన్‌లోని అనాథలకు అన్నప్రసాదాలను వితరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజానికి సేవ చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఉద్యోగ జీవితానికి వీడ్కోలు పలుకుతున్న వేళ అనాథలకు భోజనం అందించడం తమకెంతో సంతృప్తినిచ్చిందన్నారు. ఈ సందర్భంగా రాకం శ్యాంబాబు దంపతులను సన్మానించారు.ఈ కార్యక్రమంలో యూనిటి ఇన్ డైవర్సిటీ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు కత్తి నెహ్రూ గౌడ్, షేక్ జాఫర్, వైస్ ప్రెసిడెంట్ విడిఐ జయరాజు, సభ్యులు, అన్నం ఫౌండేషన్ నిర్వహకులు అన్నం శ్రీనివాసరావు, సైదులు, ఎజాజ్ పాల్గొన్నారు.

# మున్సిపాలిటీలో ఇన్‌చార్జీలతో ఇబ్బందులు



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని పలు శాఖలకు సంబంధించిన అధికారులు ఇన్చార్జులు కావడం వలన ప్రజలు పనులు కాక ఇబ్బందులు పడుతున్నారు. గత 14 నెలలుగా మున్సిపాలిటీలో పర్మినెంట్ గా శాఖ అధికారులు లేకపోవడంతో పనులన్నీ ఆలస్యంగా నడుస్తున్నవి. అధికారులు కొత్తగూడెం, సత్తుపల్లి, వైరా, ఖమ్మం, తదితర మున్సిపాలిటీల నుండి అధికారులు ఇన్చార్జిలుగా ఉండటం వలన వారికి బరువు భారం బాధ్యతలు ఎక్కువగా ఉండటం వలన ఇబ్బందులు పడుతున్నట్లు ప్రజలు పేర్కొంటున్నారు. పట్టణ ప్లానింగ్, అకౌంటింగ్, మెప్మా, ఇంజనీరింగ్ పలు శాఖల అధికారులు లేనందున అక్కడ ఇక్కడ అచ్చట ఇచ్చట పనులు చేయాలంటే ఏ పనులు కానందున మున్సిపాలిటీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత 14 నెలలుగా ఇన్చార్జిలే శరణ్యం కావడంతో ఇబ్బందులు పడుతున్నట్లు మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో ఉన్న ప్రజలు వివరిస్తున్నారు. పరిశీలించి పర్మినెంట్ అధికారులను నియామకం చేయాలని అధికారులను కోరుతున్నారు.

## సిపిఐ సభ్యులు బాలిన రాజాలు మృతి

-నివాళులర్పించిన పార్టీ శ్రేణులు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండలం లోని భైరవునిపల్లి గ్రామానికి చెందిన బాలిన రాజాలు (75) అనారోగ్యంతో సోమవారం సాయంత్రం మృతి చెందారు. విషయం తెలుసుకున్న జిల్లా కౌన్సిల్ సభ్యులు కనకబండి సీతారాములు పార్టీ శ్రేణులు తో భౌతికకాయాన్ని సందర్శించి ఎర్రజెండా కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్, సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి బాలిన కృష్ణంరాజు, ఉప సర్పంచ్ ఆలేటీ ఉమామహేష్, సహాయ కార్యదర్శి లు భద్రజీ వేంకటేశ్వర రావు, బాలెబోయిన వేంకన్న, పొలంపల్లి నారయణ, కనకబండి రామయ్య, పెద్దపాక వెంకటి తదితరులు పాల్గొన్నారు.

## తిప్పనపల్లిలో సీత్లా పండుగ



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** మండల పరిధిలోని తిప్పనపల్లి గ్రామంలో మంగళవారం బంజరాలు సీత్ల పండుగను ఘనంగా జరుపుకున్నారు. గ్రామం నుంచి డప్పు వాయిద్యాలతో, మహిళలు బోనాలు ఎత్తుకొని గిరిజన సాంప్రదాయ నృత్యాలతో బయలు దేరి, గిరిజన సాంప్రదయాలకు అనుగుణంగా గ్రామ శివారులో దేవుళ్లకు సీత్ల పండుగను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. సీత్ల పండుగ సందర్భంగా గిరిజన దేవుళ్లకు పూజలు చేయడం వల్ల పాడి పంటలు పుష్కలంగా పండుతాయని, ఎటువంటి అంటురోగాలు గ్రామంలో వ్యాపించవని గిరిజనుల నమ్మకం, ప్రతి ఏడాది సీత్ల పండుగను అత్యంత వైభవంగా జరుపుకోవడం బంజారాల ఆచారంగా వస్తుంది.

## ఘనంగా సీత్లా పండుగ



**ప్రజాపక్షం/కారేపల్లి:** బంజారా గిరిజనుల ఆరాధ్యదైవమైన సాతిభవాని సీత్ల అమ్మవారి పండుగను కారేపల్లి మండలంలోని భాగ్యనగర్ తండాలో భక్తిశ్రద్ధలు, సంప్రదాయాల నడుమ ఘనంగా నిర్వహించారు. పండుగ సందర్భంగా తెల్లవారుజాము నుంచే గ్రామస్తుల ఇళ్లను శుభ్రం చేసి, రంగవల్లులతో అలంకరించి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మహిళలు సంప్రదాయ బంజారా వస్త్రా భరణాలతో ముస్తామై అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, గ్రామ ప్రజలకు ఆయురారోగ్యాలు, పశుసంపదకు ఎలాంటి అపాయాలు కలగకుండా చూడాలని ప్రార్థించారు. అనంతరం గ్రామస్తులు డప్పు వాయిద్యాల నడుమ సంప్రదాయ నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా సీత్ల భవాని ఆలయానికి చేరుకున్నారు. అక్కడ కొబ్బరికాయలు సమర్పించి, పసుపు, కుంకుమ, నైవేద్యాలతో ప్రత్యేక పూజాలు నిర్వహించారు. మహిళలు భక్తిగీతాలు ఆలపించగా, యువకులు డప్పులు మోతలతో బంజారి సంస్కృతిక సంప్రదాయాలను చాటి చెప్పారు. సీత్ల పండుగ బంజారా సమాజ సంస్కృతి, ఆధ్యాత్మిక విశ్వాసాలు, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. తరతరాలుగా వస్తున్న ఆచారాలను కొనసాగిస్తూ చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో గ్రామ పెద్దలు హర్యా, రామకోటి, లక్ష్మణ్, హరిసింగ్, లచ్చు, రమేష్, హథీరాం, రవి, నాగేష్, గణేష్, కళ్యాణ్, రాజ్‌కుమార్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లందు ఆర్టీసీ డిపోలో వసతుల కొరత



**ప్రజాపక్షం/ఇల్లందు:** ప్రజా రవాణాలో కీలక పాత్ర పోషిస్తున్న ఇల్లందు ఆర్టీసీ డిపోలో కనీస వసతుల కొరతపై సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డిపోలో బస్సులకు సరైన షెడ్లు లేకపోవడంతో లక్షల రూపాయల విలువైన వాహనాలు ఎండకు ఎండి, వర్షాలకు తడుస్తూ దెబ్బతింటున్నాయని వాపోతున్నారు. డ్రైవర్లు, కండక్టర్లు కూడా ఎండ, వానల మధ్యే విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొందని, సిబ్బందికి విశ్రాంతి, తాగునీటి వంటి ప్రాథమిక సౌకర్యాలు సైతం పూర్తిస్థాయిలో అందబాటులో లేవని ఆరోపిస్తున్నారు. మండుతున్న ఎండల్లో ఉష్ణోగ్రతలు తీవ్రస్థాయికి చేరుకున్నప్పటికీ డిపోలో మంచినీటి సౌకర్యం లేకపోవడం ఇబ్బందికరంగా మారిందని పేర్కొన్నారు. సిబ్బంది సంక్షేమం కంటే కేవలం లక్ష్యాల సాధనపైనే అధికారులు దృష్టి సారిస్తున్నారనే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్న ఆర్టీసీ సిబ్బందికి, బస్సులకు అవసరమైన షెడ్లు, తాగునీరు. ఇతర మౌలిక సదుపాయాలు వెంటనే కల్పించాలని ఆర్టీసీ ఉన్నతాధికారులను సిబ్బంది కోరుతున్నారు.

## తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలి

**ప్రజాపక్షం/పాల్వంచ :** బహిరంగ ప్రదేశాలలో చెత్త వేయకుండా పరిశుభ్రతను పాటించాలని ఎంపిఓ షబ్నా అన్నారు. మండల పరిధి యానంబైల్ పంచాయితీలో ప్రజలకు సోలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ (ఎస్‌డబ్ల్యూఎం రూల్స్ 2026పై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఎంపిఓ మాట్లాడుతూ చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయరాదన్నారు. పర్యావరణ పరిరక్షణకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. దీనితో పరిశుభ్రమైన గ్రామాలు, ఆరోగ్యకరమైన జీవన వాతావరణ, పర్యావరణ సాధ్యమవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయితీ కార్యదర్శి, సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## గిరిజన సంక్షేమ కమిటీ చైర్మన్‌గా పాయం నియామకం

-తెలంగాణ శాసనసభ కీలక బాధ్యతలు అప్పగింత
-గిరిజన అభ్యున్నతే ధ్యేయమని స్పష్టం



**ప్రజాపక్షం/మణుగూరుః** తెలంగాణ రాష్ట్రంలోని గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి మరింత వేగం తీసుకురావాలనే లక్ష్యంతో తెలంగాణ శాసనసభ కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ శాసనసభ అసెంబ్లీ మరియు రిజిస్టర్డ్ షెడ్యూల్డ్ తెగల ట్రైబల్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్‌గా పాయం వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ శాసనసభ స్పీకర్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని షెడ్యూల్డ్ తెగల ప్రాంతాల్లో సంక్షేమ పథకాల అమలు, గిరిజనుల సమస్యలపై సమగ్ర అధ్యయనం, అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణ, ప్రభుత్వానికి అవసరమైన సూచనలు చేయడం వంటి కీలక బాధ్యతలను ఈ కమిటీ నిర్వహించనుంది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. గిరిజనులకు నాణ్యమైన విద్య, మెరుగైన వైద్య సేవలు, స్వచ్ఛమైన తాగునీరు, మెరుగైన రహదారులు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తానని స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న గిరిజన సంక్షేమ పథకాలు నిజమైన లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో చేరేలా క్షేత్రస్థాయిలో విస్తృత పర్యటనలు నిర్వహించి అధికారులతో సమీక్ష సమావేశాలు చేపడతామని వెల్లడించారు. అలాగే కమిటీ ఆధ్వర్యంలో మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాలను నిర్వహించి గిరిజనుల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని చెప్పారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి, సంక్షేమ పథకాల సమర్థ అమలు, ప్రజల సమస్యల పరిష్కారంలో కమిటీ కీలక పాత్ర పోషిస్తుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది. పాయం వెంకటేశ్వర్లుకు ఈ కీలక బాధ్యతలు అప్పగించడంపై గిరిజన సంఘాలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేస్తున్నారు.

## చిన్నారుల ఆరోగ్యమే భవిష్యత్‌కు బలమైన పునాది

శివలింగాపురం అంగన్‌వాడీ కేంద్రంలో 'తొలిముద్ద' కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం



**ప్రజాపక్షం/మణుగూరుః** మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని శివలింగాపురం గ్రామం పీహెచ్‌సి పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన 'తొలిముద్ద' కార్యక్రమంలో పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు పోషకాహారం అందించి, వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రంలో అందుతున్న సేవలు, పోషకాహార పంపిణీ, చిన్నారుల సంక్షేమ కార్యక్రమాల అమలుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చిన్నారుల జీవితంలో తొలి ఐదేళ్లు అత్యంత కీలకమైనవి. ఈ దశలో సరైన పోషకాహారం అందితేనే వారి శారీరక, మానసిక వికాసం మెరుగ్గా ఉంటుంది. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నాణ్యమైన పోషకాహారం, ఆరోగ్య సేవలు ప్రతి అర్హ కుటుంబానికి చేరేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోంది. చిన్నారుల ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడం ద్వారా బలమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుంది. ప్రజలకు అవసరమైన ప్రతి సంక్షేమ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సేవలు అందేలా నిరంతరం కృషి చేస్తాము అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, మండల ముఖ్య నాయకులు, మైనారిటీ అధ్యక్షులు, మహిళా నాయకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, తల్లులు, చిన్నారులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాణం ఖరీదు రూ. ఐదు లక్షలు..?

నిబంధలను పాతరేసిన అధికారులు
- ప్రమాణాలు పాటించకుండా కార్మికులతోపనులు

**ప్రజాపక్షం/పాల్వంచ :** విద్యుత్ శాఖ అధికారులు, గుత్తేదారుడి నిర్లక్ష్యంతో ఓమైనర్ కార్మికుడు మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండల పరిధి మొండికట్ట గ్రామంలో నూతన విద్యుత్ స్థంభాల ఏర్పాటు పనులను దక్కించుకొన్న గుత్తేదారుడు పనులు చేయిస్తున్నాడు. పనుల్లోకి వచ్చిన మండలం కూనారంకు చెందిన నాగవర్థన్ (19) మైనర్ కార్మికుడిని నిభంధనలకు పాతరేసి కనీస భద్రతా చర్యలు తీసుకోకుండా విద్యుత్ స్థభం ఎక్కించారు. స్థంభం ఎక్కిన బాలుడు కాలు జారి కిందపడిపోయాడు. తీవ్రంగా గాయపడిని కార్మికుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతి చెందిన బాలుడి నిరుపేద కుటుంబ అవసరాలను ఆసరా చేసుకొన్న గుత్తేదారుడు మైనర్ కార్మికుడి మృతిని బయటకు రాకుండా ఉండేందుకు నిండు ప్రాణానికి ఐదు లక్షలు ఖరీదు కట్టాడు. గుత్తేదారుడి పలుకుబడితో పోలీసులను సైతం బురిడీ కొట్టించి మృతుడి వయసును ఎక్కువగా నమోదు చేయించాడని ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

**- ఉద్యోగి పర్యవేక్షణ :**

పనులను గుత్తేదారుడు చేపట్టినా సరైన రీతిలో పనులు చేయించడానికి ఉద్యోగుల పర్యవేక్షణ నిరంతరం ఉండాలి. ఒకవేళ ఉద్యోగి అందుబాటులో లేని యెడల ఎల్‌సి ఇవ్వకూడదని తెలుస్తోంది. తప్పని పరిస్థితిలో లేనట్లయితే సంభంధిత సేఫ్టీ జాగ్రత్తలు తీసుకొన్నారా? లేదా అనే విషయాలు చరవాణి ద్వారా ఎప్పటికప్పుడు తెలుసుకోవాలి. కానీ సిబ్బంది అందుబాటులో లేకపోవటం సరైన ప్రమాణాలు పాటించకపోవటంతో కార్మికుడు మృతి చెందాడని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పనులు చేయటానికి ముందుగా ఎర్తింగ్ తనిఖీ చేసుకోవాలి. స్థంభం ఎక్కటానికి ముందు మినట్ రూల్స్ పాటించాలని, ఒకవేళ అనుకోని పరిస్థితిలో జారిపడినా గాయాలు తగలకుండా తలకు హెల్మెట్ , విద్యుత్ సరఫరాను తెలియజేయటానికి వోల్ట్ అలర్ట్ పెన్ ధరించాలని నిభంధనలు ఉన్నాయని తెలుస్తోంది. దీనితో కార్మికుడు జాగ్రత్త పడటానికి ఆస్కారం కలుగుతుంది. కింద పని చేసే సమయంలో చేతులకు గ్లౌజులు ధరించాలి. ఈ నిభంధనల మేరకు ఎల్‌సి ఇవ్వాలని పలువురు అంటున్నారు.

**- ఐదు లక్షలకు లక్ష చెల్లింపు :**

మృతుడి ప్రాణానికి ఐదు లక్షలు వెల కట్టిన గుత్తేదారు చివరకు లక్ష ఇచ్చి చేతులు దులుపుకొని మోహం చాటేశాడని పుకార్లు షికార్లు చేస్తున్నాయి. త్వరలో బాధిత కుటుంబానికి అండగా ఆదివాసీ సంఘాలు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారికి ఫిర్యాదు చేయనున్నారనే సమాచారం. ఈ విషయంపై పాల్వంచ రూరల్ విద్యుత్ శాఖ ఏఈ రవీందర్ వివరణ కోరగా అంతా మా డిఈ చూసుకొంటాడని నిర్లక్ష్యపు సమాధానం ఇవ్వటం కొసమెరుపు.

## 1వ తేదీన జీతాల చెల్లింపు సీఎం ప్రకటన పచ్చి బూటకం

**ప్రజాపక్షం/ఇల్లందు:** కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులందరికీ ప్రతి నెల 1వ తేదీన జీతాలు చెల్లిస్తామని ప్రభుత్వం చేసిన ప్రకటన ఆచరణలో కనిపించడం లేదని టీయూసీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు ఏరియా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ యాకుబ్ షావలి, పాయం వెంకన్న, మల్లెల వెంకటేశ్వర్లు ఆరోపించారు. ఇల్లందులోని ఎల్లన్న విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రగతి శీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ, అటవీ శాఖ, ప్రభుత్వ ఆసుపత్రులు, మహిళా శిశు సంక్షేమ శాఖ తదితర విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఇప్పటికీ సకాలంలో జీతాలు అందడం లేదన్నారు. తక్కువ వేతనాలతో పని చేస్తున్న కార్మికులు జీతాల ఆలస్యంతో కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేసి, ప్రతి నెల 1వ తేదీన కార్మికుల ఖాతాల్లో వేతనాలు జమ చేయాలని డిమాండ్ చేశారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో పాయం వెంకన్న, యూనియన్ నాయకులు రాజేష్, సంపత్, రవిరెడ్డి, అక్బర్, మహేష్, రాజమ్మ, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

## దెందుకూరు పిఏసిఎస్‌ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్



**ప్రజాపక్షం/మధిర మున్సిపాలిటీః** ఖరీఫ్ సీజన్ నేపద్యంలో రైతులకు ఎరువుల పంపిణీ, విత్తనాల సరఫరాలో పారదర్శకతను పర్యవేక్షించేందుకు ఖమ్మం జిల్లా కలెక్టర్ టిఎస్ దివాకర ఎస్ మంగళవారం దెందుకూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పిఏసిఎస్) కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయానికి చేరుకున్న కలెక్టర్ గోదాముల్లో నిల్వ ఉన్న ఎరువుల స్టాక్ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఖరీఫ్ సాగుకు అత్యంత కీలకమైన సమయంలో రైతులక ఎటువంటి కొరత రాకూడదని ఆయన స్పష్టం చేశారు. యూరియా ఇతర ఎరువుల లభ్యంతపై అధికారులతో చర్చించిన ఆయన నిల్వల వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని, బ్లాక్ మార్కెటింగ్‌కు ఏ మాత్రం తావు లేకుండా ప్రభుత్వ నిర్ణీత ధరలకే విక్రయాలు జరగాలని ఆదేశించారు. తనిఖీల్లో భాగంగా కలెక్టర్ స్థానిక రైతులతో నేరుగా మాట్లాడారు. వారికి అందుతున్న సేవలు విత్తనాల నాణ్యత, ఎరువుల పంపిణీపై రైతుల నుంచి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు సకాలంలో నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందజేయడమే లక్ష్యంగా సొసైటీ పనిచేయాలని, రైతులు కార్యాలయానికి వచ్చినప్పుడు వారిని ఆదరించి సమస్యలను పరిష్కరించడంలో అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో మధిర తహశీల్దార్ రాంబాబు, మధిర ఏడిఏ వాణిశ్రీ, సాయి దీక్షిత్, పిఏసిఎస్ అధ్యక్షులు కోట వెంకటకృష్ణ, గ్రామ సర్పంచ్ పగిడిపల్లి శ్రీనివాసరావు, సొసైటీ సెక్రటరీ నెలకుదుటి వెంకటేశ్వరరావు, గ్రామ పెద్దలు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ వేగవంతం చేయాలి

- ఎన్నికల నమోదు అధికారి, ఆర్‌డిఓ మధు





**ప్రజాపక్షం/చుంచుపల్లిః** బిఎల్‌ఓలు సకాలంలో ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ, డిజిటైజేషన్ వేగవంతం చేయాలని ఆర్‌డీఓ మధు ఆదేశించారు. మంగళవారం చుంచుపల్లి మండలం, విద్యానగర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎన్నికల నమోదు అధికారి, ఆర్‌డిఓ మధు ఆధ్వర్యంలో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల జాబితా సవరణ ప్రక్రియను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బూత్ లెవల్ అధికారులు ప్రతి ఓటర్‌ని వ్యక్తిగతంగా సంప్రదించి ఎన్యూమరేషన్ ఫారాలు (ఈఎఫ్‌లు) సకాలంలో సేకరించాలని సూచించారు. సేకరించిన ఫారాలను ఎలాంటి జాప్యం లేకుండా డిజిటైజేషన్ చేసి, నిర్ధేశించిన గడువులోపు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటర్ల వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన ప్రతి ఓటర్‌ని ఎన్నికల జాబితాలో నమోదు చేసేలా కృషి చేయాలని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో చుంచుపల్లి తహశీల్దార్ నాగరాజు, విద్యానగర్ గ్రామ సర్పంచ్ భూక్యా శాంతి శ్రీ, ఉప సర్పంచ్ వాసిరెడ్డి మురళి, వార్డు సభ్యులు, బూత్ లెవల్ అధికారులు, పంచాయతీ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థినులకు నాణ్యమైన విద్య, వేడి భోజనం అందించాలి

-ఐటీడీఏ పీఓ బి రాహుల్





**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థినులకు నాణ్యమైన విద్యాబోధనతో పాటు మెనూ ప్రకారం వేడి, నాణ్యమైన భోజనం అందించాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి బి రాహుల్ సూచించారు. మంగళవారం గౌరారం బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన తరగతి గదులు, డార్మిటరీ, స్టోర్ రూమ్, వంటశాలలను పరిశీలించారు. విద్యార్థినుల గణితం, ఆంగ్ల ప్రతిభను అభినందిస్తూ, పదో తరగతి విద్యార్థులకు విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే ప్రణాళికబద్ధంగా బోధన కొనసాగించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు కోసం నైపుణ్యాలను పెంపొందించుకోవాలని విద్యార్థినులకు పిలుపునిచ్చారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో సపోటా మొక్క నాటి, పోషకాహార భోజనాన్ని పరిశీలించి పరిశుభ్రత, ఆహార నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. సమీప జీపీఎస్ పాఠశాల విద్యార్థులను ఏజీహెచ్‌ఎస్ గౌరారం పాఠశాలలో విలీనం చేస్తే మెరుగైన విద్య అవకాశాలు కల్పించవచ్చని అభిప్రాయపడ్డారు. ఈకార్యక్రమంలో హెచ్‌ఎం మోతిర్, వీరస్వామి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినులు, పాల్గొన్నారు.

## రైతు భరోసా డబ్బులపై ఫ్రీజింగ్..!

-బ్యాంకు మేనేజర్లు, రైతుల మధ్య శాంతి, సహన పోరాటం
-ప్రభుత్వ లక్ష్యానికి గండి, గమ్మున చూస్తున్న అధికారులు

**ప్రజాపక్షం/కూసుమంచి :** రాష్ట్ర ప్రభుత్వం రైతుల వ్యవసాయానికి ఆర్థిక భరోసా కల్పించేందుకు విడుదల చేస్తున్న రైతు భరోసా నిధుల కూసుమంచి మండలంలో కొన్ని బ్యాంకుల్లో ఫ్రీజింగ్‌కు గురవుతున్నాయనే ఆరోపణలు రైతుల్లో తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేస్తున్న నిధులను కొందరు బ్యాంకులు రుణ బకాయిల పేరుతో నిలిపివేయడం లేదా సర్దుబాటు చేయడం వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో ఒక వైపు బ్యాంకు మేనేజర్లు బ్యాంకింగ్ నిబంధనలను చూపిస్తుండగా, మరో వైపు ప్రభుత్వం రైతులకు సాగు పెట్టుబడుల కోసం అందిస్తున్న సాయాన్ని పూర్తిగా అందించాలని రైతులు కోరుతున్నారు. దీంతో రైతులు, బ్యాంకు అధికారుల మధ్య మాటల యుద్ధం కాకుండా, శాంతియుతంగా తమ హక్కుల కోసం పోరాటం సాగిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. ప్రభుత్వం రైతులకు సకాలంలో ఆర్థిక చేయూత అందించి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలనే లక్ష్యంతో రైతు భరోసా నిధులను విడుదల చేస్తోంది. అయితే కొన్ని చోట్ల ఈ నిధుల వినియోగంపై తలెత్తుతున్న వివాదాలు ప్రభుత్వ ఉద్దేశాన్ని దెబ్బతీసేలా బ్యాంకుల విధానాలు ఉన్నాయని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఈ అంశంపై సంబంధిత శాఖ అధికారులు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసి, రైతులు ప్రయోజనాలు కాపాడేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ప్రభుత్వం బ్యాంకులు, రైతుల మధ్య సమన్వయం పెరిగితేనే రైతు భరోసా పథకం అసలు లక్ష్యం నెరవేరుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## దంతెనంలో భారీ చోరీ

-నగదు, బంగారం అపహరణ

**ప్రజాపక్షం/దుమ్ముగూడెం :** దుమ్ముగూడెం మండలం దంతెనం గ్రామంలో భారీ చోరీ జరిగింది. గ్రామానికి చెందిన రిటైర్డ్ రైతు సహకార సంఘం సీఈఓ ఏసుదాసు కుటుంబ సభ్యులతో కలిసి జూన్ 14న హైదరాబాద్ వెళ్లగా, సోమవారం తిరిగి వచ్చి ఇంట్లో సామాన్లు, బీరువాలు చిందరవందరగా ఉండటాన్ని గుర్తించారు. ఇంట్లో ఉంచిన నగదు, బంగారం కనిపించకపోవడంతో దుమ్ముగూడెం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసునమోదుచేసి దర్యాప్తుచేపట్టారు.

## రూ 25వేలతో పాఠశాలకు గేటు విరాళం




**ప్రజాపక్షం/ఏన్కూరు:** మండలంలోని రాజలింగాల ప్రాథమిక పాఠశాలకు రూ 25వేల వ్యయంతో గ్రామానికి చెందిన నల్లమోతు వెంకటరమణ, శ్రీదేవి దంపతులు గేటును విరాళంగా అందజేశారు. గేటును గ్రామ సర్పంచ్ దానసరి నవీన్ ప్రారంభించి, దాత దంపతులను అభినందించారు. గ్రామాభివృద్ధికి ఉద్యోగులు, గ్రామస్తులు ముందుండాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ తిరపయ్య, వార్డు సభ్యులు నాగమణి, కౌశల్య, మానస, ప్రియాంక, గ్రామ కార్యదర్శి విజయ, జీపీఓ ఉమారాణి, ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్, ఉపాధ్యాయులు విజయ, శ్రీలత, అంగన్‌వాడీ టీచర్లు నరసమ్మ, సరిత, గ్రామ పెద్దలు మోతుకూరి గోపాలరావు, సురేష్, రెడ్డిబోయిన లక్ష్మణరావు, గోగుల నారాయణ, కొంగర వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

## హెల్ప్‌డెస్క్‌పై అవగాహన



**ప్రజాపక్షం/చుంచుపల్లిః** చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీ గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఇంటిన్సివ్ రివిజన్ (ఎస్‌ఐఆర్) హెల్ప్‌డెస్క్‌ను సిపిఐ మండల కార్యదర్శి, ఉప సర్పంచ్ వాసిరెడ్డి మురళి సందర్శించి కార్యక్రమంలో పాల్గొన్నారు. హెల్ప్‌డెస్క్‌కు వచ్చిన ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలు (ఈఎఫ్‌లు) నింపడంపై అవగాహన కల్పిస్తూ, అవసరమైన సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క ఓటరు తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకుని, ఎన్యూమరేషన్ ఫారాలను సకాలంలో సమర్పించాలని కోరారు. ఎన్నికల జాబితా సవరణ ప్రక్రియను విజయవంతం చేయడంలో ప్రజల సహకారం ఎంతో అవసరమని తెలిపారు. ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ, అధికారులు మరియు బీఎల్‌ఓలు అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, బూత్ లెవల్ అధికారులు( బీఎల్‌ఓలు) లక్ష్మి, నాగమణి, నాగరాణి, రాణి, బిఎల్‌ఓలు 1వ వార్డు మెంబర్ జి.కృష్ణమూర్తి, 6వ వార్డు మెంబర్ వీరస్వామి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లను పూర్తి చేయాలి



**ప్రజాపక్షం/పాల్వంచ :** మండలంలో ఇందిరమ్మ గృహాల నిర్మాణాలు ప్రభుత్వ నిభంధనలు పాటిస్తూ త్వరిత గతిన పూర్తి చేయాలని ఎంపిడిఓ పి. రాజారావు అన్నారు. మండల పరిధి తోగ్గూడెంలో సర్పంచ్ శోభతో కలిసి ఇందిరమ్మ గృహాల నిర్మాణ పనులు, మొక్కల పెంపకం పదితర పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో నాటిన ప్రతీ మొక్కను సంరక్షించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గ్రామాభివృద్ధి పథకాల అమలులో సంభంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ పథకాలను ప్రజలకు సకాలంలో అందించటానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ రఘుపతి, ఈసి కే. పుల్లయ్య, పంచాయితీ కార్యదర్శి రవికుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మార్పిఎస్ ఆవిర్భావ దినోత్సవం



**ప్రజాపక్షం/జూలూరుపాడుః** జూలూరుపాడు మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జెండా ఆవిష్కరించారు. మందకృష్ణ మాదిగ 61వ జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి జన్మదిన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. జిల్లా అధికార ప్రతినిధి చెంగల గుర్నాథం హాజరై జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా చెంగల గురునాథం మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఉద్యమం ప్రారంభమై 32 ఏళ్లు పూర్తి చేసుకుందని తెలిపారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో దళిత బహుజన సమాజం కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు సాధించామని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, చెంగల గురునాథం, దిబ్బెందుల సాయికుమార్, కాకటి కృష్ణ, చెంగల నరసింహారావు, కాకటి నరేందర్, నేలాల వెంకట రామారావు, కాకటి సుదర్శనం, పండు, వికాస్, చందు, పవన్, ప్రసాద్, చరణ్, తదితరులు పాల్గొన్నారు.. మరియు కరవారిగూడెం, కాకర్ల, పాపకొల్లు పెద్ద హరిజనవాడ, నరసాపురం, వెంకన్నపాలెం గ్రామాలలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

# ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ సమర్థవంతంగా నిర్వహించాలి

## కలెక్టర్ దివాకర టీఎస్



**ప్రజాపక్షం/మధిర మున్సిపాలిటీ:** మధిర, ఎర్రుపాలెం మండలాల్లో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియను మంగళవారం కలెక్టర్ దివాకర టీఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియ భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా అత్యంత పారదర్శకంగా, నిష్పాక్షికంగా, ఖచ్చితత్వంతో పూర్తి చేయాలని ఆదేశించారు. సూపర్‌వైజర్లు, భూత్‌స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేస్తున్న విధానం, నింపిన ఫారాలను స్వీకరిస్తున్న తీరు, ఓటర్ల వివరాలను నమోదు చేసే ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పలు కాలనీలు, నివాస ప్రాంతాలను సందర్శించిన కలెక్టర్ నేరుగా ఓటర్లతో మాట్లాడారు. ప్రతీ బీఎల్ఓ తప్పనిసరిగా బీఎల్ఓ యాప్ ద్వారా క్షేత్రస్థాయిలోనే వివరాలను నమోదు చేయాలని, సమాచార నమోదులో ఎలాంటి పొరబాట్లు దొర్లకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. డేటా నమోదు, ధృవీకరణ ప్రక్రియలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. అర్హులైన ప్రతీ ఓటరు తన వ్యక్తిగత వివరాలను సక్రమంగా నమోదు చేసి, పూర్తి చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను నిర్ణీత గడువు లోగా సంబంధిత బీఎల్ఓలకు అందజేసి ప్రజాస్వామ్య ఎన్నికల వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టీఓ శ్రీనివాస్, మధిర తహసీల్దార్ రాంబాబు, ఎర్రుపాలెం తహసీల్దార్ సునీత ఎలిజబెత్, మధిర మున్సిపల్ కమిషనర్, సూపర్‌వైజర్లు, బూత్‌స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ సమస్యలను పరిష్కరించాలి

## అడిషనల్ కలెక్టర్ శ్రీజకు వినతి



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీలోని సమస్యలను పరిష్కరించాలని, ఎన్నికల ముందు శంకుస్థాపన చేసిన అభివృద్ధి పనులు వెంటనే ప్రారంభించాలని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వైరా మున్సిపాలిటీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఎం వైరా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వైరా మున్సిపాలిటీలోని తక్షణ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఖమ్మం జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీజకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం మాట్లాడుతూ వర్షాకాలం సీజన్‌లో డ్రైనేజీలు, పారిశుద్ధ్యం, పనులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణలో జరగాలని అన్నారు. మున్సిపాలిటీ ఏర్పడిన అప్పటి నుండి నేటి వరకు అధికారంలో ఉన్న ప్రభుత్వం, మున్సిపాలిటీలోని పాలకవర్గం ఒకే పార్టీ అయినప్పటికీ, ఇప్పటివరకు వైరా మున్సిపాలిటీకి పర్మినెంట్‌గా దంపింగ్ యార్డ్ లేకపోవడం బాధాకరమన్నారు. వైరా మున్సిపాలిటీ పరిధిలో ఎప్పటి నుంచో అసంపూర్తిగా ఉన్న రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణం చేపట్టాలని, వర్షాకాలం సీజన్‌లో డ్రైనేజీల మురుగునీరు పూర్తిస్థాయిలో బయటికి వెళ్లక దుర్వాసనతో పాటు దోమలకు పుట్టినిల్లుగా మారాయని, అంటు వ్యాధులు ప్రబలి ప్రజలు ప్రాణాలతో చెలగాటం ఆడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక సందర్భాల్లో పార్టీ ఆధ్వర్యంలో నిర్దిష్టంగా అన్ని వార్డుల్లో సర్వే నిర్వహించి ఎక్కడ ఏ సమస్య ఉంది. వినతిపత్రం రూపంలో అధికారులకు ఇచ్చినప్పటికీ ఆ పనులు అమలు జరగడం లేదని విమర్శించారు. వైరా చెరువు కుడి కాల్వ ఇంది రమ్మ కాలనీ వద్ద కాలనీవాసులు చెత్త కాల్వల్లో పడేయడం వలన కాల్వ పూడిపోయిందని, అది సాగునీటి కాల్వ అని గుర్తించే పరిస్థితి లేదని, వైరా మున్సిపాలిటీ డ్రైనేజీగా సాగు కాల్వ ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని, వెంటనే చెత్తను తొలగించి శాశ్వతంగా చెత్త కాల్వలో వేయకుండా పరిష్కారాన్ని ఏర్పాటు చేయాలని, తల్లాడ రోడ్డులో ప్రధానమైన డ్రైనేజీని, బ్రాహ్మణపల్లి కామిశెట్టి కళ్యాణ మండపం రోడ్డు డ్రైనేజీకి లింకు కలపడం వలన డ్రైనేజీ నుంచి వచ్చే నీటికి చిన్న కాల్వ సరిపోవడం లేదని దానిని పునఃనిర్మాణం ప్రారంభించాలని తదితర ప్రధానమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే ప్రజలను సమీకరించి ప్రత్యేక ఆందోళనలు చేపడతామని తెలిపారు. అదనపు కలెక్టర్ శ్రీజ సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్, పట్టణ నాయకులు హరి వెంకటేశ్వరరావు, కొంగర సుధాకర్, పైడిపల్లి సాంబశివరావు, గుడిమెట్ల మోహన్‌రావు, షేక్ నాగుల్‌పాషా, కామినేని రవి, గుమ్మా నర్సింహారావు, కౌన్సిలర్ కిన్నెర కృష్ణ, చిత్తూరు మురళి, మాడపాటి మల్లికార్జునరావు, మాడపాటి వెంకటేశ్వరరావు, యనమద్ది రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అన్నారుగూడెంలో ఓటు నమోదుపై అవగాహన



**ప్రజాపక్షం/తల్లాడ:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఓటరు నమోదు ప్రక్రియ(సర్) కార్యక్రమంలో భాగంగా తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సత్తుపల్లి నియోజకవర్గం బీఎల్‌ఏ ఇంఛార్జి రాయల రాము అవగాహన కల్పించారు. గ్రామంలో ఓటు నమోదు ప్రక్రియ ఎలా చేపట్టాలనే దానిపై 5బూత్‌ల బీఎల్ఏ, బీఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. ఓటరు నమోదు ప్రక్రియ పకడ్బంధీగా చేపట్టాలని, ఎటువంటి పొరబాట్లు జరగకుండా నిబంధనల ప్రకారం ఫారాలను పూర్తిచేసేలా చూడాలని, తగు సూచనలను అందించారు. గ్రామంలో 50శాతం నమోదు ప్రక్రియ పూర్తి చేసినందుకు గాను బీఎల్ఏ, బీఎల్ఓలను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా డీసీసీ ప్రధాన కార్యదర్శి గోవింద్ శ్రీనివాసరావు, మాజీ వీడీసీ ఛైర్మన్ మార్నెళ్ల మల్లిఖార్జునరావు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తుమ్మలపల్లి రమేశ్, మాజీ ఎంపీటీసీ జోసెఫ్, గ్రామ కార్యదర్శి నాగేశ్వరరావు, ఇండ్ల రంగ, ఎల్లంకి వెంకటయ్య, దుగ్గిని సత్యమయ్య, బీఎల్ఓలు, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, అధికారులు, గ్రామస్తులు, బూత్ లెవల్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బాలల సదనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే పాయం



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని శివలింగాపురం పీహెచ్‌సి సమీపంలో బాలల సదనం (చిల్డ్రన్ హోమ్) ను పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులకు అందుతున్న వసతి, ఆహారం, విద్య, వైద్య సదుపాయాలు, పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం చిన్నారులతో ఆప్యాయంగా మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. బాలల సంరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, ప్రభుత్వం అందిస్తున్న అన్ని సంక్షేమ సేవలు ప్రతి చిన్నారికి సక్రమంగా అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశించారు. చిన్నారుల భవిష్యత్తు బంగారు భవిష్యత్తుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, మండల ముఖ్య నాయకులు, మైనారిటీ అధ్యక్షులు, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మధిర అభివృద్ధి పనులను పరిశీలించిన కలెక్టర్



**ప్రజాపక్షం/మధిర మున్సిపాలిటీ:** మధిర పట్టణంలో మంగళవారం కొనసాగుతున్న రిటైనింగ్ వాల్, మహాప్రస్థానం అభివృద్ధి పనులు, అండర్ డ్రైనేజీ నిర్మాణం, అండర్ గ్రౌండ్ కేబుల్ పనులను ఖమ్మం జిల్లా కలెక్టర్ టిఎస్.దివాకర, ఐఏఎస్ పరిశీలించారు. పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకొని, నాణ్యతతో పాటు నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మధిర మున్సిపాలిటీ చైర్‌పర్సన్ సామినేని సుజాత, మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తలుపుల వెంకటేశ్వర్లు, మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పారుపల్లి విజయ్‌కుమార్,డ వలప్‌మెంట్ కమిటీ సభ్యులు వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, రంగా శ్రీనివాసరావు, మున్సిపల్ కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలను కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఈ సందర్భంగా నాయకులు, అధికారులు పేర్కొన్నారు.

# ఎస్ఐఆర్‌ను సమర్థవంతంగా అమలు చేయాలి



**ప్రజాపక్షం/ఎర్రుపాలెం:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియ భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. మండలంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. బీఎల్ఏ, బీఎల్ఓలు ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిష్పక్షపాతంగా, ఫారాలు పూర్తి చేయడంలో తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని అన్నారు. ఈ మేరకు నాయకులు, అధికారులు సహాయ సహకారాలు అందించి ఓటరు వివరాలను నమోదు చేయాలని సూచించారు.

# మిషన్ భగీరథ సిబ్బంది వివరాలను అందించాలి

## అదనపు కలెక్టర్ శ్రీజ



**ప్రజాపక్షం/వైరా:** వైరా రిజర్వాయర్ వద్ద మిషన్ భగీరథ పంపు హౌస్‌ను మంగళశారం ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ పంపు చెట్ల పనితీరు నీటి పరిశుభ్రత గురించి ఆమె అడిగి తెలుసుకున్నారు. అనంతరం భగీరథలో పనిచేస్తున్న కార్మికుల వివరాలను, వారి ఆధార్‌కార్డులను తనకు అందజేయాలని ఆదేశించారు. విధులకు ఎంతమంది హాజరవుతున్నారు. ఎవరెవరు ఏ విధంగా విధి నిర్వహణ చేస్తున్నారు అనే ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా తెలపాలని అదనపు కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

# సర్ పట్ల జాగ్రత్తగా ఉండాలి



**ప్రజాపక్షం/వైరా:** సర్ కార్యక్రమంపై అప్రమత్తంగా ఉండాలి. ప్రజలకు అవగాహన వచ్చేలా ప్రతి ఒక్కరూ బిఆర్ఎస్ పార్టీ తరపున సమన్వయంతో పనిచేయాలని ఆర్‌జెసి క్రిష్ణ అన్నారు. మంగళవారం వైరా మున్సిపాలిటీ పరిధిలోని 5, 12 వార్డులో సర్ కార్యక్ర మాన్ని ఆర్‌జెసి క్రిష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌జెసి క్రిష్ణ మాట్లాడుతూ బిఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు వైరా మున్సిపాలిటీ, మండలంలో ప్రతి గ్రామంలో స్వయంగా తిరుగుతూ సర్ కార్యక్రమం ఎలా నిర్వహిస్తున్నారో ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉంటూ అర్హుల పేర్లు ఓటర్ల జాబితాలో నుండి గల్లంతు కాకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జునరావు, వనమా విశ్వేశ్వరరావు, బానోతు మనీషా లక్ష్మి, కౌన్సిలర్లు చిలకా కోటయ్య, మాదినేని సునీత, బిఆర్ఎస్ మండల, పట్టణ మాజీ అధ్యక్షులు బాణాల వెంకటేశ్వర్లు, మద్దెల రవి, పెరుమాళ్ళ కృష్ణమూర్తి, మాదినేని దుర్గాప్రసాద్, అప్పం సురేష్, మిట్టపల్లి కిరణ్, నూకల ప్రసాద్, తిరుపతి శ్రీను, ఏదునూరి శ్రీను, మేదరమెట్ల శ్రీనివాసరావు, నూకల వాసు, తన్నీరు కిషోర్, ఆదూరి ప్రేమ్, వజినేపల్లి చక్రవర్తి, కొల్లా రాంబాబు, కట్టా నాగేశ్వరరావు, ఏలూరు నర్సింహారావు, వేముల శివ, జడల కళ్యాణ్, రావూరి సురేష్, సింగవరపు నరేష్, కొమ్ము సైదులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ గ్రామాన దండోరా జెండా రెపరెపలు



**ప్రజాపక్షం/తల్లాడ:** మండల కేంద్రంలో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు, ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను కోర్‌కమిటీ సభ్యులు ఏపూరి వెంకటేశ్వరరావు మాదిగ, తల్లాడ మండల అధ్యక్షుడు ఎక్కిరాల నాగేశ్వరరావు మాదిగ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఆకలి కడుపులు అక్షరాలు తెలియని జీవితాల నుంచి ఉద్భవించిన దండోరా లక్ష్యాన్ని సాధించుకునే మందకృష్ణ మాదిగ నాయకత్వంలో నిరంతరం పోరాటాలకు సిద్ధమవుతుందని, వర్గీకరణ సాధించుకున్న సందర్భంగా ప్రతీ మాదిగ తల్లిదండ్రులు తమ బిడ్డలను బడికి పంపి ఉన్నతవిద్యలో నేర్చుకోవడానికి గొప్ప చదువులు చదివించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఇంఛార్జి కోట బలరాం మాదిగ, ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు ఎక్కిరాల నాగేశ్వరరావు, ఎక్కిరాల నాగరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ మాగంటి వెంకటి విహెచ్‌పీఎస్ జిల్లా నాయకులు ఆదూరి సుధాకర్, మండల అధికార ప్రతినిధి, ఆదూరి రవి, వీరయ్య, సంఘసాని హరి తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన పాయం



ప్రజాపక్షం/మణుగూరు: మణుగూరు మండలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు మణుగూరు మండలానికి చెందిన 36 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.17 లక్షల 30 వేల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో భరోసానిస్తోందని అన్నారు. అత్యవసర వైద్య చికిత్సల కోసం ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక సహాయం అనేక కుటుంబాలకు అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రజలకు అవసరమైన ప్రతి సందర్భంలో అందుబాటులో ఉండి సేవ చేయడం తన బాధ్యతగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మండల నాయకులు, కార్యకర్తలు, సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు మరియు అధికారులు పాల్గొన్నారు.

# ఎస్టీ సంక్షేమ కమిటీ ఛైర్మన్‌గా పాయం నియామకం



ప్రజాపక్షం/అశ్వాపురం: తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ట్ తెగల సంక్షేమ కమిటీ ఛైర్మన్‌గా నియమితులైన పినపాక నియోజకవర్గ శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లుకి అశ్వాపురం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు. అశ్వాపురంలో ఓరుగంటి వీరయ్య భవన్‌లో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లును సాదరంగా ఆహ్వానించి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈసందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ ఛైర్మన్‌గా నూతన బాధ్యతలు చేపట్టిన పాయం వెంకటేశ్వర్లు గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి కోసం మరింతగా సేవలందించాలని ఆకాంక్షించారు. గిరిజన ప్రాంతాల సమస్యలు, విద్య, వైద్యం, ఉపాధి, సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించి ఆదివాసీ, గిరిజన ప్రజల అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఓరుగంటి బిక్షమయ్య, సీనియర్ నాయకులు వేములపల్లి రమేష్, మట్టా వీరభద్రారెడ్డి, సర్పంచులు కోర్సా కృష్ణ, జిమ్మా ఝాన్సీ, యేనిక ఉషారాణి, కుంజా జాను, తెల్లం నాగమణి, ఇర్పా కవిత, హర్ష నాయక్, మేకల అంజిబాబు, బట్టా సత్యనారాయణ, యేనిక రవిబాబు, తెల్లం నాగరాజు, తెల్లం వెంకటేశ్వర్లు, గొల్లపల్లి నరేష్, వేముల విజయ్, కమ్మాల వెంకన్న, మురికిపూడి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి చరిత్ర ప్రజలకు తెలుసు..

-నేర చరిత్ర గురించి అందరికి తెలుసు
-మాపై తప్పుడు ఆరోపణలు నిరూపించు
- కోనాయిగూడెం మాజీ సర్పంచ్ పెంటమళ్ల పుల్లమ్మ



ప్రజాపక్షం/నేలకొండపల్లి : రహదారులు వేయకుండా బిల్లులు తీసుకునే చరిత్ర ఎవరికి ఉందో ప్రజలకు తెలుసునని కోనాయిగూడెం మాజీ సర్పంచ్ పెంటమళ్ల పుల్లమ్మ అన్నారు. మండలం లోని కోనాయిగూడెం లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. పంచాయతీ లో రోడ్లు వేయకుండా, కాగితాల పై వ్రాసుకుని తీసుకునే చరిత్ర ప్రస్తుత సర్పంచ్ కోటి సైదారెడ్డి కి ఉంటుందన్నారు. చేసిన పనులకు బిల్లులు ఇవ్వకుండా తప్పుడు ఆరోపణలు తో తప్పించుకోలేవన్నారు. దొంగ బిల్లులు తీసుకోవాల్సిన దుస్థితిలో మేము లేవన్నారు. గ్రామస్తుల పై దాడులు చేసి జైలు శిక్షలు అనుభవించి, రౌడీషీటర్ చరిత్ర మాకు లేదన్నారు. పంచాయతీ కి సంబంధించిన బోరు తాము వేసుకోలేదన్నారు. మాపై ఎలాంటి కేసులు లేవన్నారు. అవినీతి చేసి బతకాల్సిన అవసరం మాకు పట్టలేదన్నారు. మాపై ఆరోపణలు చేసిన వ్యక్తి చరిత్ర ప్రజలందరికీ తెలుసున్నారు. పంచాయతీ తీర్మానం, ఎంబీ రికార్డు, క్వాలిటీ కంట్రోల్ రిపోర్ట్ ఇలా అనేక నివేదికలు ఉంటాయన్నారు. ఎవరిపైనో ఆధారపడి బతకాల్సిన అవసరం అంతకన్నాలేదన్నారు. నీలాంటి తప్పుడు, ఆసత్య ఆరోపణలు చేస్తే చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. అధికార పార్టీలో ఉండి, సర్పంచ్ గా మమల్ని ఇబ్బందులు పెట్టాలని చూశావు కానీ ఏమీ చేయలేకపోయావన్న విషయం ను గుర్తుంచుకోవాలన్నారు. నెల కు కనీసం రెండు రోజులు కూడ చెత్త ట్రాక్టర్ వేయలేక, దోమల మందు పిచికారి చేయకుండా, పాలన సాగించే నీకు మా గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. విద్యుత్ బల్బులు ఎక్కడ తీసుకున్నావో, ఎంత కు బిల్లులు పెట్టాలని చూసినావో అన్ని వెలుగులోకి తీసుకోస్తామన్నారు. తప్పుడు ఆరోపణలు మానుకోని పాలన సాగించున్నారు.

# ఆంబోతుకు కన్నీటి వీడ్కోలు

-కొమరారంలో విషాదం, డోలు వాయిద్యాలతో ఘనంగా అంతిమయాత్ర



ప్రజాపక్షం/ఇల్లందు: ఇల్లందు మండలం కొమరారం గ్రామంలో ఆప్యాయంగా పెంచుకున్న ఆంబోతు మృతి చెందడంతో గ్రామమంతా విషాదంలో మునిగిపోయింది. గత వారం రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆంబోతుకు వైద్యం అందించినప్పటికీ మంగళవారం మధ్యాహ్నం మృతి చెందింది. గ్రామ బొడ్రాయి ప్రతిష్టాపన సందర్భంగా గ్రామ ప్రజలంతా ఐక్యంగా మాజీ మంత్రి రాంరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో తీసుకొచ్చిన ఈ ఆంబోతును అప్పటి నుంచి గ్రామస్తులు తమ కుటుంబ సభ్యుడిగా ప్రేమగా చూసుకున్నారు. గ్రామానికి ప్రత్యేక గుర్తింపుగా నిలిచిన ఆంబోతు మృతి చెందడంతో రైతులు, మహిళలు, యువకులు కన్నీటి పర్యంతమయ్యారు. అనంతరం గ్రామస్తులు డోలు వాయిద్యాదలు, బ్యాండ్ మేళాలు, భారీ ఊరేగింపుతో ఆంబోతుకు ఘనంగా అంతిమ వీడ్కోలు పలికారు. గ్రామంలోని పలు వీధుల గుండా సాగిన అంతిమ యాత్రలో వందలాది మంది పాల్గొని తమ అభిమానాన్ని చాటుకున్నారు. అదే విధంగా కొమరారం గ్రామంతో పాటు బడితండా, గుడితండా, చింతలగుంపు, ఇందాలతండా, నవనంగారా తండా, హరిజనవాడ, కోరంగుంపు, కుంజావారిగుంపు, బీసీ కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆంబోతుకు ఘన నివాళి అర్పించారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ బుర్రి ప్రవీణ్, మాజీ ఉప సర్పంచ్ మూడుమాలు, ధరావత్ తారాచంద్, వాంకుడోత్ ప్రేమ్ కుమార్, వాంకుడోత్ మోతీలాల్, గుగులోత్ బిచ్చ, గుగులోత్ పుల్య, అజ్మీర సేవ, బద్రు, మూడ్ శ్రీను, బాలు, సక్రం, సీతారాం, భూక్యా మంగీలాల్, భారతి, గైగోళ్ల శ్రీను, గైగోళ్ల కృష్ణ, మంచ రవీందర్, పకీరా, గుగులోత్ కిషన్, ఈరు, అలెం రాంబాబు, అలెం శ్రీను, జోగాబాబు, పూనెం నర్సయ్య, నాగన్న, అజ్మీర సక్రం, భాదావత్ బొద్య, భూక్యా హచ్చ, పాషా, కృష్ణ, జోగా కృష్ణ, శివ, రాంచంద్, అవుదొడ్డి వెంకన్న, మూడ్ లింగ, రాములు, మంగు, ఉపాధ్యాయుడు గుగులోత్ దేవా, గ్రామ పంచాయితీ కారోబార్ లక్ష్మ ణ్, తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికలను తలపించిన గురుకుల పాఠశాల ఎన్నికలు

## వివిధ పదవులకు బరిలో నిలిచిన 56 మంది విద్యార్థులు



ప్రజాపక్షం/నేలకొండపల్లి : పంచాయతీ ఎన్నికల తరహా లోనే సాంఘిక గురుకుల బాలికల పాఠశాల ఫ్యానల్ ఎన్నికలు నిర్వహించారు. నేలకొండపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కాలేజీలో మొత్తం 600 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాల కమిటి కి ఎన్నిక లు నిర్వహించారు. పాఠశాల విద్యార్థుల కమిటి అధ్యక్షురాలు, స్పోర్ట్స్ కమిటి అధ్యక్షురాలు, కల్చరల్ కమిటి అధ్యక్షురాలు, స్కూల్ ఫీపుల్ కమిటి అధ్యక్షురాలు తదితర కమిటి లకు ఎన్నికలు నిర్వహించారు. కాగా శనివారం నామినేషన్ లు నిర్వమించగా... మొత్తం 56 మంది వివిధ పదవులకు నామినేషన్ల స్వీకరించారు. ఆది, సోమ వారాలలో అభ్యర్థులు పంచాయతీ తరహా లోనే ప్రచారం నిర్వహించారు. మంగళవారం ఓటింగ్ ను నిర్వహించారు. ఏ ఎన్నికల అధికారిగా ఉన్న ప్రిన్సిపాల్ శ్రీలత ఆధ్వర్యంలో ఓటింగ్ నిర్వహించారు. ప్రిసెండింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రిసిడింగ్ అధికారులు, మొత్తం పోలింగ్ సిబ్బంది ని ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఓటింగ్ సమయంలో పోటీ లో ఉన్న అభ్యర్థులు పంచాయతీ తరహాలోనే ఓట్లు అభ్యర్థించటం విశేషంగా ఆకట్టుకుంది. ఓటర్ల గా ఉన్న విద్యార్థులు తమ ఓటు హక్కు ను బ్యాలెట్ బాక్స్ లో వేశారు. వారి చేతికి ఇంకును కూడ వ్రాశారు. మొత్తం మీద విద్యార్థులతంతా ఓటు హక్కు ను వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల ఫలితాల ను బుధవారం వెల్లడించనున్నట్లు ఎన్నికల అధికారి శ్రీలత తెలిపారు. దీంతో బరిలో ఉన్న అభ్యర్థులలో ఫలితాల కోసం టెన్షన్గా ఎదురుచూస్తున్నారు.

# మారుమూల గ్రామాల్లో అభివృద్ధి పరుగులు

## మార్కెట్ కమిటి ఛైర్మన్ వెన్నపూసల



ప్రజాపక్షం/నేలకొండపల్లి : కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో మారుమూల గ్రామాల లో అభివృద్ధి పరుగులు పెట్టిస్తున్నారని నేలకొండపల్లి వ్యవసా య మార్కెట్ కమిటి ఛైర్మన్ వెన్నపూసల సీతారా ములు పేర్కొన్నారు. మండలం లోని కొత్తకొ త్తూరులో నూతనంగా మంజూరైన సీసీ రోడ్ల కు మంగళవారం శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత పదేళ్లలో అభివృద్ధి ని బీఆర్ఎస్ ప్రభుత్వం పక్కన పడేసిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత నే అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. మంత్రి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక చొరవ తో పాలేరు నియోజకవర్గం లో పనులు శర వేగంగా సాగుతున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తారన్నారు. గుడిసె లేని గ్రామాలను తయారు చేయటమే మంత్రి శ్రీనివాసరెడ్డి లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతీ రహదారి కి బీటీ, సీసీ లు వేయటమే ప్రభుత్వం ఉద్దేశ్యమన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఉప సర్పంచ్ వల్లాల రాధాకృష్ణ, టీజేఎస్ జిల్లా నాయకులు మాదాసు శ్రీనివాసరావు, బీజేపీ మండలాధ్యక్షుడు పాగర్తి సుధాకర్, కాంగ్రెస్ నాయకులు చూళోత్ అయోధ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సీత్లా భవాని పండుగ






ప్రజాపక్షం/ఏన్కూరు: మండల వ్యాప్తంగా సీత్ల భవాని పండుగను బంజారాలు మంగళవారం ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. బంజారాలకు అత్యంత పవిత్రమైన, విశిష్టమైన పండుగలలో ఇది ఒకటి. ఈ పండుగను బంజారా ప్రజలు తమ ఇలవేల్పు దేవత అయిన సీత్ల భవానీ మాతను ఆరాధిస్తూ భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తండాలలోని చిన్నలు పెద్దలు అందరూ కలిసి వచ్చి బంజారా సంప్రదాయం ప్రకారం సీత్ల భవానీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలను పశువులు, పంటలకు అంటు వ్యాధులు రాకుండా ఉండాలని ప్రకృతి విపత్తుల నుంచి రక్షించాలని కోరారు. మహిళలు సంప్రదాయ బంజారా వస్త్రాలు, వెండి అభరణాలు ధరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, కొబ్బరికాయ, పండ్లు నైవేద్యాలు సమర్పించి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. కొన్ని ప్రాంతాల్లో సంప్రదాయ ఆచారాల ప్రకారం పశుపూజ కూడా నిర్వహించారు. తండాలో జానపద గీతాలు, నృత్యాలు, సామూహిక వేడుకలతో ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు.

# నేడు విగ్రహ ప్రతిష్టా మహోత్సవం



ప్రజాపక్షం/ములకలపల్లి: ములకలపల్లి మండలం జగన్నాధపురం పంచాయితీ పరిధిలోని నల్లివారి గూడెం గ్రామంలో వేంచేసి ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద నేడు ఉదయం 8గంటలకు సీతారాముల విగ్రహం, శివలింగం, సుబ్రహ్మణ్య స్వామి విగ్రహాల ప్రతిష్టా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం ఉదయం 11గంటలకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ములకలపల్లి మండలంలోని భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.

# పక్కదారి పట్టిన 'ఇందిరమ్మ'..!

**ఒక రేషన్ కార్డు.. మూడు ఇళ్లు మంజూరు**
**-ఒకే బేస్మెంట్‌పై ఇద్దరికి బిల్లుల చెల్లింపులు!**
**-జక్కేపల్లిలో వెలుగుచూసిన ఘటన**



ప్రజాపక్షం/కూసుమంచి: కూసుమంచి మండలంలోని జక్కేపల్లి ఎస్సీ కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వడ్డించేవాడు మనవాడైతే ఏ వైపు కూర్చున్న వడ్డించేది వడ్డించే విధంగానే ఉంటుందన్నట్లుగా ఉన్నది ఇంకా రాజు తలుచుకుంటే దెబ్బలకు కొదవ అనే పద్ధతిని తలపిస్తోంది. ఓ సినిమా డైలాగు నీ సైతం తలపిస్తోంది పైన ఫాదర్ ఉన్నాడు కింద ఖాదర్ ఉన్నాడు మనకేం హాయం అన్ని చూసుకుంటారులే అనే విధంగా వ్యవహరించినట్లు తెలుస్తుంది. జక్కేపల్లి ఎస్సీ కాలనీ గ్రామ పంచాయితీలో ఒకే కుటుంబానికి చెందిన సభ్యుల పేర్లపై వరుసగా ప్రభుత్వ గృహ పథకాల లబ్ధులు అందున్నాయనే ఆరోపణలు గ్రామంలో చర్చనీయాంశంగా మారాయి. స్థానికుల కథనం ప్రకారం ఒకే రేషన్ కార్డుకు చెందిన కుటుంబంలో ఇప్పటికే తల్లి పేరుపై గతంలో గృహ నిర్మాణానికి రూ 9,800 చెల్లింపులు జరిగినట్లు రికార్డులు చూపుతున్నాయి. అదే కుటుంబానికి చెందిన కొడుకు పేరుపై మే 2026లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం రూ 1లక్ష వరకు బిల్లు చెల్లింపులు జరిగినట్లు సమాచారం వెలుగులోకి వచ్చింది. ఈ వ్యవహారమంతటికి ఆ సమయంలో పని చేసిన పంచాయితీ కార్యదర్శి కారణమనేది సర్వత్ర చర్చనీయాంశంగా మారింది. పంచాయితీ కార్యదర్శులు ఏది తలుచుకుంటే అది చేయగలరని విమర్శలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. అంతేకాకుండా, ఒకే పాత బేస్మెంట్‌ను ఆధారంగా చేసుకుని ఇద్దరు వ్యక్తుల పేర్లపై నిర్మాణ బిల్లులు పొందినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదే సమయంలో అదే కుటుంబానికి చెందిన తండ్రి పేరు తాజాగా విడుదలైన ఎల్1 జాబితాలో నమోదు కావడం మరిన్ని అనుమానాలకు తావిస్తోంది. జక్కేపల్లి ఎస్సీ కాలనీలో ఓ రాజకీయ పార్టీలో పని చేస్తున్న అధికార ప్రతినిధి వ్యవహారంగా తెలుస్తోంది.

**గ్రామస్తులు ప్రశ్నిస్తున్న అంశాలు....**

ఒకే రేషన్ కార్డు కలిగిన కుటుంబ సభ్యులకు వరుసగా గృహ లబ్ధులు ఎలా లభించాయి. ?ఒకే బేస్మెంట్‌పై ఇద్దరికి బిల్లులు ఎలా ఆమోదమయ్యాయి.? ఇప్పటికే లబ్ధి పొందిన కుటుంబ సభ్యుల వివరాలు పరిశీలించకుండా కొత్త మంజూరులు ఎలా జాబితాలో చేరాయి.? అధికారులు భౌతిక పరిశీలన నిర్వహించారా లేదా. ?ఈ వ్యవహారంపై గ్రామ ప్రజలు తీవ్ర ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అసలు అర్హుల హక్కులు దెబ్బతినే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే సంబంధిత అధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను బయటపెట్టాలని, తప్పులు జరిగినట్లయితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**ప్రజలు ఎన్నో సమాధానం చెప్పేది ఎవరు...?**

ఒకే కుటుంబానికి వరుస లబ్ధులు వెనుక మర్మం ఏమిటి...?అర్హుల హక్కుల హరించబడుతున్నాయా? జక్కేపల్లి ఇందిరమ్మ ఇళ్ల వ్యవహారంపై జిల్లా అధికారులు స్పందిస్తారా..?జక్కేపల్లి ఎస్సీ కాలనీలో వెలుగుచూస్తున్న ఈ వ్యవహారం ప్రస్తుతం కూసుమంచి మండల వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. అధికారులు స్పందించి పూర్తి వివరాలు వెల్లడించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. ఈవిషయంపై ఎంపీడీవో జస్వంత్ కుమార్ మాట్లాడుతూ...మండలంలోని జక్కేపల్లి ఎస్సీ కాలనీలో ఈ వ్యవహారంపై ఒకే రేషన్ కార్డులో ఉండి పలు విధాల బిల్లులు తీసుకున్న అంశంపై రెండు మూడు రోజుల్లో వివరణ అందిస్తామని ఎంపీడీవో జస్వంత్ కుమార్ తెలిపారు. ఇది ఇలా ఉండగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి నీ గత పది రోజుల క్రితం నుంచి ప్రజాపక్షం విలేఖరి గుర్తు చేస్తున్న ఈ కరెక్టైన సమాచారం చెప్పటం అధికారుల పనితీరుకు అద్దం పడుతుంది.

# ప్రతి విద్యార్థి ఉత్తీర్ణతే లక్ష్యం

**-వెనకబడిన విద్యార్థులకు ప్రత్యేక బోధన**
**-ఇంటర్మీడియట్ విద్యపై కలెక్టర్ సమీక్ష**



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : జిల్లాలోని ప్రతి ఇంటర్మీడియట్ విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా పకడ్బందీ కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా కలెక్టర్ ఇంటర్మీడియట్ విద్యాశాఖ పనితీరు, విద్యా ఫలితాలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల అభివృద్ధి పనులు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా గత విద్యా సంవత్సరపు ఫలితాల విశ్లేషణ, వచ్చే విద్యా సంవత్సరానికి కార్యాచరణ ప్రణాళిక, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కొనసాగుతున్న సివిల్ పనుల పురోగతిపై ప్రైవేట్ జూనియర్ కళాశాలల అనుమతులపై సమీక్షించగా మెరుగుదల పరీక్షల అనంతరం ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 72 శాతం, ద్వితీయ సంవత్సరంలో 86 శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లా రాష్ట్రంలో మూడవ స్థానంలో నిలిచిందని కలెక్టర్‌కు సంబంధిత అధికారులు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉత్తీర్ణత సాధించని విద్యార్థులపై సమగ్ర విశ్లేషణ చేపట్టి కారణాలను గుర్తించాలని ముఖ్యంగా ఏ సబ్జెక్టులో వెనకబడి ఉంటున్నారో గుర్తించి ఆ సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్‌ను తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. వెనకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక బోధన అందించాలన్నారు. జిల్లాలో 15 జూనియర్ కళాశాలల అభివృద్ధి పనులకు రూ.2.96 కోట్లు మంజూరయ్యాయన్నారు. అందులో రూ.2.26 కోట్లు కళాశాలల ఖాతాలకు విడుదల కాగా ఇప్పటి వరకు రూ.1.59 కోట్లు వినియోగించినట్లు తెలిపారు. కళాశాలల్లో నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. అనుబంధ గుర్తింపు అవసరమైన అనుమతులు లేకుండా ఏ ప్రైవేటు జూనియర్ కళాశాల కూడా నిర్వహించరాదని కలెక్టర్ తెలిపారు. ప్రతి కళాశాలలో శాశ్వత ప్రయోగశాలలు, అవసరమైన మౌళిక సదుపాయాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించి లోపాలు సరిదిద్దుకునేందుకు నెల గడువు ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కె. రవిబాబు, ఇంజనీరింగ్ అధికారులు, ప్రిన్సిపాళ్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పంచాయతీలకు నిధులు, విధులు తక్షణమే బదిలీ చేయాలి

**-పంచాయతీరాజ్ ఛాంబర్ జాతీయ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్**




ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : దేశ వ్యాప్తంగా ఉన్న గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్, మున్సిపాలిటీలు, కార్పోరేషన్లకు రాజ్యాంగబద్ధంగా ఇవ్వాల్సిన నిధులు, విధులు, అధికారాలు, సిబ్బంది దిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే బదిలీ చేయాలని పంచాయతీరాజ్ ఛాంబర్ జాతీయ అధ్యక్షులు వైవిబి రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం ఖమ్మం కెఎల్ఆర్ క్లబ్‌లో పంచాయతీరాజ్ ఛాంబర్ జాతీయ కమిటీ సమావేశాలు జాతీయ అధ్యక్షులు వైవిబి రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా సుమారు 2.60 లక్షల గ్రామ పంచాయితీలకు, మండల పరిషత్‌లకు, జిల్లా పరిషత్‌లకు, మున్సిపాలిటీలకు, కార్పోరేషన్లకు చట్టబద్ధంగా, రాజ్యాంగ బద్ధంగా ఇవ్వాల్సిన నిధులు, విధులు, అధికారాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే బదిలీ చేయాలని కోరారు. అధికార వికేంద్రీకరణ, స్థానిక స్వపరిపాలన, స్వయం పోషకత్వాలను స్థానిక సంస్థలకు బదిలీ చేయకపోవడం వల్ల పంచాయతీరాజ్ సంస్థలు నిర్వీర్యమైపోతున్నాయని తద్వారా గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. గ్రామీణ ప్రజలకు కావాల్సిన మౌళిక సౌకర్యాలు, తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, లైటింగ్, ఉపాధి వంటివి కొరవడటంతో ప్రజలు పట్టణాలకు వలసపోతున్నారన్నారు. 73, 74వ రాజ్యాంగ సవరణ చట్టాలను మళ్లీ సవరణ చేయాలని కోరారు. సర్పంచ్‌లు, ఎంపిటిసిలకు, జెడ్పిటిసిలు, జిల్లా పరిషత్ చైర్మన్, కౌన్సిలర్లు, కార్పొరేటర్లకు, చైర్మన్లకు, మేయర్లకు గౌరవ వేతనాలను పెంచాలని ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలకు డిమాండ్ చేశారు. తెలంగాణ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షులు చింపుల సత్యనారాయణరెడ్డి, పంచాయతీరాజ్ ఛాంబర్ జాతీయ ప్రధాన కార్యదర్శి పుసులూరి నరేంద్ర తదితరులు ప్రసంగించారు. ఈ సమావేశంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల పంచాయతీ రాజ్ ఛాంబర్ ప్రధాన కార్యదర్శులు బద్దెపల్లి సిద్దార్థ, బీర్రు ప్రతాపరెడ్డి, తెలంగాణ ఛాంబర్ ఉపాధ్యక్షులు శశికళ యాదవ్‌రెడ్డి, పురుషోత్తమ రెడ్డి, పి. అశోక్‌రావు, శ్రీశైలయాదవ్, లోడిగ వెంకన్న యాదవ్, జెడ్పిటిసిల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బెల్లం శ్రీనివాస్, కార్యదర్శులు వడ్డె నారాయణరావు, సామినేని హరిప్రసాద్, వెంకట్, శంకర్ యాదవ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వానపల్లి లక్ష్మి, పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆనేపు రామకృష్ణ నాయుడు, వై. వినోదరాజు, వానపల్లి ముత్యాలరావు, కొత్తపు మునిరెడ్డి, సింగంశెట్టి సుబ్బరామయ్య, సర్పంచుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జల్లు కొండయ్య, సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి పగడాల రమేష్, గౌరవ సలహాదారు ముల్లంగి రామకృష్ణారెడ్డి, వీరభద్ర ఆచారి, సత్తిరాజు, ఇరు రాష్ట్రాల కమిటీ సభ్యులు , జాతీయ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన వసతుల కల్పన

**-అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన**



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మం నగర ప్రజలకు మెరుగైన వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఖమ్మం నగరంలోని 58వ డివిజన్‌లో కోటి రూపాయలతో నిర్మించనున్న సిసి డ్రైన్ పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ నగరంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచేందుకు ప్రణాళికాబద్ధంగా తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. నగరాన్ని ఆహ్లాదకరంగా, పరిశుభ్రత, పచ్చదనంతో ఉండేలా ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలతో పది కాలాల పాటు మన్నేలా చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, మాజీ మేయర్ పునుకొల్లు నీరజ, అధికారులు, ప్రజాప్రతినిధులు, జిల్లా కాంగ్రెస్ నాయకులు నూతి సత్యనారాయణ గౌడ్, దొబ్బల సౌజన్య, మాజీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

# పోలీస్‌స్టేషన్‌ల ఆదునీకీకరణకు ప్రణాళికలు



ప్రజాపక్షం/నేలకొండపల్లి : త్వరలో పోలీస్ స్టేషన్ లను ఆధునీకరణ కు ప్రణాళికలు చేస్తామని మల్టీజోన్ 1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఖమ్మం జిల్లా నేలకొండపల్లి పోలీస్ స్టేషన్ ను మంగళవారం తనిఖీ చేశారు. అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. పోలీస్ స్టేషన్ ఆవరణ అంతా కలియతిరిగారు. సీసీ కెమెరాల పనితీరు ను పరిశీలించారు. రిసెప్షన్ వద్ద కు వెళ్లి సేవలు గురించి ఆరా తీశారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. పలు రికార్డులను పరిశీలించారు. అధికారులుకు, సిబ్బంది కి పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గతంలో పోలీస్ స్టేషన్ లను రూ.5 లక్షల పోలీస్ స్టేషన్ గా పిలిచే వారని అన్నారు. త్వరలోనే ప్రతీ పోలీస్ స్టేషన్ లకు నిధులు కేటాయించి ఆధునీకీకరణ చేపట్టి ప్రణాళికల చేస్తామని అన్నారు. అదే విధంగా పక్క రాష్ట్రాలతో సత్సంబంధాలు కలిగి ఉండాలని అన్నారు. కేసులు, ప్రమాదాలు ఇతరత్రా సమాచారం కోసం రాష్ట్రాల మధ్య సమన్వయం అవసరం అన్నారు. రాష్ట్రాల మధ్య కేసుల పరంగా ఒకరికి ఒకరు సహకరిస్తూ ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి, కూసుమంచి సీఐ సంజీవ్, వివిధ పోలీస్ స్టేషన్ ల ఎస్సై లు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా టీయుడబ్ల్యూజే (ఐజెయూ) భద్రాచలం పట్టణ మహాసభ

**పట్టణ అధ్యక్ష కార్యదర్శులుగా విజ్జిగిరి రాజా కిరణ్, పాకాల శివ గౌడ్**



ప్రజాపక్షం/భద్రాచలం (టౌన్) : భద్రాచలం పట్టణ మహాసభ మంగళవారం స్థానిక రాఘవ నిలయం (రెడ్డి సత్రం)లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి యూనియన్ జాతీయ కౌన్సిల్ మెంబర్ బి.వి.రమణారెడ్డి, జిల్లా అధ్యక్షులు జాగు వెంకటరత్నం పాల్గొని పట్టణ నూతన కమిటీని ఎంపిక చేశారు. పట్టణ అధ్యక్షులుగా విజ్జిగిరి రాజా కిరణ్ (ఆంధ్రప్రభ), ఉపాధ్యక్షులుగా అన్వేష్ రెడ్డి (ఆర్ టివి), కార్యదర్శిగా పాకాల శివ (ఎస్‌డి టివి తెలుగు), సహాయ కార్యదర్శిగా బి.నాయుడు (వార్త), కోశాధికారిగా శ్రీశ్రీ (వార్త), ఆర్గనైజింగ్ సెక్రటరీగా ప్రేమ్‌కుమార్ (6 టివి), కార్యవర్గ సభ్యులుగా నాగేందర్ (ఎన్‌హెచ్‌చ 9), జగన్ (8 టివి), ప్రదీప్ (సిటి కేబుల్), సాయి కుమార్ (విజయ క్రాంతి) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం బి.వి.రమణారెడ్డి, జెవి.రత్నం మాట్లాడుతూ బుధవారం జరిగే సెమినార్ విజయవంతం చేయాలని, సెమినార్‌కి యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామనారాయణ, తెలంగాణ రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డిలతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు హాజరవుతుండటంతో యూనియన్ సభ్యులు అందరూ సకాలంలో హాజరై సెమినార్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి భద్రాచలం డివిజన్ ప్రింట్ మీడియా అధ్యక్షులు భూక్యా రంజిత్ నాయక్, ఉపాధ్యక్షులు కాటా సత్యం, ఎల్రక్ట్రానిక్ మీడియా డివిజన్ అధ్యక్షులు ఎల్.శ్రీహరి కుమార్, గౌరవ సలహాదారులు కుప్పాల నాగరాజు, కార్యదర్శి జయరాం, కోశాధికారి బాల కిరణ్, జిల్లా, డివిజన్ యూనియన్ నాయకులు, యూనియన్ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఘనంగా సీత్లా పండుగ





ప్రజాపక్షం/ రఘునాథపాలెం : గిరిజనుల ఆరాధ్య దైవమైన సీతలా అమ్మవారి పండుగను ఘనంగా నిర్వహించారు. మంగళవారం సీతల భవాని పండుగను పురస్కరించుకుని మండల వ్యాప్తంగా పలు గిరిజన గ్రామాల్లో సీతలా అమ్మవారి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సాంప్రదాయ ఆచారాలను పాటిస్తూ కుటుంబ సభ్యులు, గ్రామస్తులంతా కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులంతా ఆయురారోగ్యాలతో ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని, గ్రామంలో సుఖ శాంతులు నెలకొనాలని ప్రార్థించారు. ఆట పాటలు, నృత్యాలతో పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. శివాయిగూడెం గ్రామంలో జరిగిన వేడుకల్లో వైరా మాజీ ఎంఎల్‌ఏ బానోత్ చంద్రావతి పాల్గొని గ్రామస్తులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.